అక్టోబర్ - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**


A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890



## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| అందమైన అబద్ధం | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| మిక్కిలి సాత్వికుడు | కొడవటికంటి | 07 |
| సమరయస్త్రీ(ఫోటీనా | ఎ.ఎన్.ఆర్.జక్కం | 09 |
| సాక్ష్యము | పద్మజరాణి, కనిగిరి | 12 |
| ఉత్సాహముగా ఇచ్చుట | | 14 |
| దేవుని పని | చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| మీ పట్ల దేవుని ప్రణాళిక | | 20 |
| దేవుడు - సిరి | | 21 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |
| పరిశుద్ధగ్రంథ పరిశోధన పట్టిక-4 | | 24 |


సీరియల్ నంబరు

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు  కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

పత్రికను ఆదరిస్తున్నందుకు మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. రోజులు చాలా త్వరగా గడచి పోతున్నాయి. దేవుని రాకడ సమీపమవుతుంది. మనుష్యులంతా ధన సంపాదనలో చాలా బిజీగా ఉన్నారు. రేపు అనబడే భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకుంటున్నారు. రేపు ఎలా బ్రతకాలన్న భయంతో తమ ఆత్మను రక్షించుకోవాలన్న ఆలోచన లేకుండా తమ శరీరాన్ని బ్రతికించుకోవడానికి చింతిస్తున్నారు. రేపటి రోజు మానవులకు క్రొత్తరోజు. రేపు ఇంతకముందు ఎన్నడూ రాలేదు. మరలా మన కొరకు రాదు. మనల్ని వెంబడిస్తూ, భయపెడుతూ వస్తున్న క్రొత్తరోజును చూసి భయపడవద్దు అన్నాడు ప్రభువు. రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును అన్నాడు. మనుష్యులు భయపడటానికి ముఖ్యకారణం దేవుని మరచిపోవటం. మనం మరణించేటంత వరకు మనల్ని విడువక ఎడబాయక కాపు కాస్తున్న దేవుని వాగ్దానాన్ని గ్రహించకపోవటం. యెహోవా నా కాపరి అని నమ్మకపోవటం. కొందరు అన్ని విషయాలలో సమృద్ధిగా ఉన్నా, వారికి రేపు అనే విషయం ఆందోళన కలిగిస్తుంది. కొందరు వచ్చేవారం గురించి, మరికొందరు వచ్చే నెల గురించి, మరి కొందరు వచ్చే సంవత్సరం గురించి భయపడుతుంటారు. అందుకే ప్రభువు ఏనాటి కీడు ఆనాటికే చాలును అన్నాడు. అంటే మనం ఈ రోజు విషయమై సంతృప్తి కలిగి ఉండమని. అన్నిటికంటే ముఖ్యమైనది మనం విడిచి వచ్చిన మార్గము మనం మరచిపోతుంటాము. మనం నడవబోయే మార్గాన్ని గురించి దిగులు పడటానికి కారణం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభువునుబట్టి ధైర్యముగా ఉండమని మనవి చేస్తున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా  మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

6

# జప్నత్పనేహు

**(యోసేపు జీవితచరిత్ర)**

**– కొడవటికంటి**

ఇదంతా కడుపులోని ఆకలి పలికిస్తున్న మాటలేమో అనుకున్నాడు. కాని, ఆకలి హత్యను కోరదుగాని హింసను కోరుతుంది. అయితే ఇది ద్వేషం, పగ. ఇవి ఎవరిలో ఉద్భవించుతాయో, వారిలోని మానవత్వాన్ని క్రమేపి మాయం చేస్తాయి. వారిలో మానవత్వం మరుగయ్యే కొద్దీ ఎవరి మీదకి అవి గురిపెట్టబడుతుంటాయో, వారి మీదికి సూటిగా, లోతుగా ప్రయోగింపబడతాయి. యూదా ఈ ప్రసంగం మార్చాలని ఆలోచిస్తున్నాడు.

దూరంగా ఉన్న కొండమీద ఉన్నత స్థలం మీద ఉన్న పూజారులను ఒకసారి దర్శిస్తే ఏదన్నా సహాయం దొరుకుతుందేమో అనుకొని, ఛ...ఛ...వారు అన్యులు, విగ్రహారాధికులు. తను అదుల్లాము గుహ దగ్గర మందలు మేపేటప్పుడు చాలాసార్లు తన అన్నదమ్ములను విడిచి వేరుగా జీవించాలని అనుకున్నాడు. కాని తను లేకపోతే మిగిలిన వారిని క్రమంలో పెట్టడం జ్యేష్ఠునికి చేతకాదు అనుకున్నాడు.

మిగ్దల్ఏదెరు నుండి హెబ్రోను చేరిన తర్వాత రూబేను ప్రవర్తనలో పూర్తిగా మార్పు వచ్చింది. ఇంతకుముందు పెద్ద కుమారుడని తన తండ్రి అతిశయించేవాడు. అయితే ఒకరోజు తన తండ్రి అతనిని పిలిచి ఏకాంతంగా మాట్లాడిన తర్వాత మిగ్దల్ఏదెరు నుండి గుడారాలు తీసుకొని హెబ్రోను వైపు ప్రయాణం సాగించేటప్పటి నుండి జ్యేష్ఠుడు కనిష్ఠునిగా, బలహీనునివలె మారిపోయాడు. ఎవరితోను ఎక్కువగా మాట్లాడేవాడుకాదు. కనీసం తల్లి లేయాతో కూడా ఒంటరిగా ఎదురుగా మాట్లాడడం లేదు.

మానసికంగా తన అన్న రూబేనులోని ఈ మార్పు యూదాలో నిద్రావస్థలో ఉన్న కొన్ని గుణాలను బయటకు తేవలసిన అవసరం వచ్చింది. యూదా తన సహోదరుల కంటే హెచ్చినవాడాయెను. ఈ కొద్ది సంవత్సరాలలోనే యూదా అన్ని విషయాలలోను పెద్దరికం చూపించసాగాడు. రూబేను కూడా ఈ విషయంలో సంతోషించాడు. యూదా చేసే పనులు, ఆలోచించే విధానం కాని అటు యాకోబుకు, ఇటు రూబేనుకు యుక్తముగా తోచేవి.

అందరికంటే ముందుగా రూబేనుకే వివాహం నిశ్చయమైంది. రూబేనుకు ఇష్టమైన వధువు, ఇష్టమైన రీతిలోనే జరిగింది. మొదటి నుండి రూబేనుకు జిల్పా కుమారుడు గాదు అంటే ప్రేమగా ఉండేవాడు. గాదు కూడా రూబేనును గౌరవించి భయపడేవాడు. రూబేను చెప్పే ప్రతి మాటకు లోబడి యుండేవాడు.

ఇశ్శాఖారు, లేవి ఉన్న చోటికి వెళ్ళి వారికి కొంత మాంసం ఇవ్వాలని, రూబేను అనుకున్నాడు. గాదు, రూబేను తనకు చెప్పినట్లు లేవీ వాళ్ళ కొరకు గొఱ్ఱెపిల్లని వధించి ఆహారం తయారు చెయ్యాలని అనుకుంటుండగా ఆకాశంలో దుమ్ము లేవటం కనిపించింది. మరలా ఇష్మాయేలీయుల గుంపు ఐగుప్తు వైపుగా వ్యాపారానికి వెళ్తున్నారు అనుకున్నాడు. వారు ఈ మార్గాన్నే వెళ్ళాలి. ఒకవేళ వారి దగ్గర అమ్మకానికి రొట్టెలు ఉంటే కొన్ని కొనుక్కోవచ్చు. వారు గాజాలో మరలా అవసరమైతే రొట్టెలు కొనుక్కుంటారు. గాజా పెద్ద పట్టణమే. మంచి రొట్టెలు, విలువైన వస్త్రాలు దొరుకుతాయి. సముద్రం మీద నుండి గాజా వారు ఐగుప్తుతోను తూరు సీదోనుతోను సముద్ర వ్యాపారం చేస్తుంటారు ఆ వర్తకులు దగ్గరగా వచ్చినప్పుడు గాదు వారి దగ్గరకు వెళ్ళి వారు గోధుమపిండిని గొఱ్ఱెపిల్లలకు మారకం ఇస్తారేమో అడిగితే, వారు అందుకు ఒప్పుకోలేదు. గొఱ్ఱెపిల్లని వెండి రూకలతో కొంటామంటే గాదు ఒప్పుకోలేదు.

ఇంతలో కొండ కొన మీద కుందేళ్ళ కోసం వెళ్ళిన నఫ్తాలి పెద్దగా అరుస్తూ గాదును పైకి రమ్మని సైగ చేస్తుంటే

గాదు కొండమీదకి పరుగెత్తాడు. బహుశా కుందేళ్ళ మందలు అక్కడ ఎక్కువగా ఉన్నాయేమోనని అనుకున్నాడు. కాని నఫ్తాలి చూపు చాలాదూరంగా రెండు గాడిదలు, ఒక గాడిద మీద సరుకులు, ఒక గాడిద మీద రంగురంగుల అంగీ కనిపించింది. అనుమానంలేదు వచ్చేది యోసేపే! ఆ రంగుల అంగీ, ఆ విచిత్రగామైన రంగుల అంగీ ఎంత దూరం నుంచి అయినా గుర్తుపట్టవచ్చు. వాడి తండ్రి యాకోబు యోసేపును ఎంత ప్రేమిస్తున్నాడో ఆ అంగీ చెప్తుంది.

గాదుకి కోపం రగులుతుంది. నఫ్తాలి చేయి పట్టుకొని గబగబ క్రిందికి పరుగెత్తాడు. దాను, ఆషేరును కలుపుకొని దూరంగా వెళ్ళాడు. యూదాకి ఏమి అర్థం కాలేదు. రూబేను వారి వద్దకు వెళ్ళి కొంచెంసేపు మాట్లాడి యూదా దగ్గరికి వచ్చాడు. అప్పుడు కాని అర్థం కాలేదు. జిల్పా బిల్హా కుమారుల చెడుతనం. వారు నిజంగానే యోసేపును చంప నిశ్చయించుకున్నారు. ఇప్పుడు వారిని నివారించటం కుటుంబ అంతంగా మారిపోతుంది. అయినా దీనికి ప్రత్యామ్నాయం ఆలోచించాలనుకుంటూ రూబేనువైపు చూశాడు. రూబేను ముఖం తెల్లగా పాలిపోయింది. యూదా వైపు మౌనంగా చూశాడు. అలా చూసేకొద్దీ రూబేను ముఖం రంగులు రంగులుగా మారిపోయింది. ఆలోచనలలో తలమునకలై పోయాడు. అయితే కండబలం చూపించే వాడిలా రెండు పిడికిళ్ళు బిగించాడు.

రూబేను కొండ ఎక్కి చూశాడు. ఇప్పుడు యోసేపు కనుచూపు మేరలో కనిపించాడు. ఒక చిన్న దిబ్బ మీద నిలబడి చుట్టూ చూస్తున్నాడు. మా కొరకే వెతుకుతున్నాడను కున్నాడు రూబేను. పెద్దగా అరుస్తూ చేతులు పైకెత్తి ఊపుతున్నాడు. క్రింద నుండి యూదా చూస్తున్నాడు. గాదు, నఫ్తాలి, ఆషేరు ఏదో వాదించు కుంటున్నారు. చిన్నవాడు దగ్గరకు వస్తే వీళ్ళు యోసేపును తాకకుండా చూడాలను కుంటూ కొంచెం పడమరగా ఉన్న ఇసుకదిబ్బ మీద నిలబడి కొండమీద ఉన్న రూబేనును చూస్తున్నాడు యూదా.

రూబేను ఇప్పుడు తలగుడ్డ తీసి చేతికర్రకు కట్టి ఎత్తుగా పెట్టి ఊపుతున్నాడు. కొంచెంసేపటికి యోసేపు రూబేనును గుర్తించి సంతోషంగా అన్నల దగ్గరకు పరుగెడు తున్నాడు. కొండచుట్టి రావడానికి కొంచెం సమయం పడుతుంది. రూబేను కొండ దిగి వచ్చేటప్పటికి యూదా తప్ప మిగిలిన వారందరూ యోసేపును చంపటం గురించి మాట్లాడుకోవటం రూబేను గమనించాడు.

వెంటనే గాదు దగ్గరకు వచ్చి “ఆ చిన్నవాని గురించి జాగ్రత్త పడండి. ఎవరి ప్రాణమైనా వేరొకరు తీయటం దేవుడు నిషేదించాడు” అన్నాడు రూబేను.

కాని గాదు ముఖం ఇప్పుడు రూబేను గుర్తించలేనంత ద్వేషంతో కనబడింది. గాదు తన నడికట్టులోని కత్తి బయటకు లాగుతూ “ఈ రోజు భూమి మీద ఆ కలలు కనేవాడి ఊపిరి నిలిచి వుంటే నా ఊపిరి నేనే తీసుకుంటాను” అని అన్నాడు.

“నీ ఊపిరి నీవు తీసుకున్నా నా ఊపిరి నాలో ఉండగా యోసేపు బ్రతికి ఉండడు” అని అన్నాడు నఫ్తాలి.

“నలభై కోసుల దూరంలో ఉన్న తండ్రిని వదలి వీడు ఇంతదూరం రావటం వీడి చావు కొరకే. మరలా మనకు ఇటువంటి అవకాశం దొరకదు. కనుక ఈ దినం వాడు చావవలసిందే” అంటూ అరిచాడు నఫ్తాలి.

రూబేను యోసేపుకు ఎదురుగా పోతుంటే యూదా పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆపాడు. ఇప్పుడు యూదా గొంతు దుఃఖంతో పూడుకొని పోయినట్లుగా మాట్లాడుతున్నాడు.

“అన్నా! ఈ పరిస్థితుల్లో యోసేపు హత్య గావింప కుండా ఆపలేము. ఒకవేళ మనము బలము ప్రదర్శిస్తే జిల్పా కుమారులు, బిల్హా కుమారులు మన చేతిలోనే మరణిస్తారు. కనుక తెలివిగా ఈ పరిస్థితిని ఎదుర్కోవాలి. సమయం ఎక్కువగా లేదు. యోసేపు ఇక్కడకు చేరుకోక ముందే మనము ఏదైనా ఉపాయం ఆలోచించాలి. ప్రస్తుతానికి అతని చావు తప్పించగలిగామంటే ఇక యోసేపుకు ఎన్నటికి చావు ఉండదు” అని సలహా ఇచ్చి రూబేనును వెనక్కు తీసుకొని వచ్చాడు.

రూబేను జిల్పా కుమారులు, బిల్హా కుమారుల యొద్దకు వచ్చి వారి నడికట్లలో నుండి కత్తులను బలవంతంగా

తీసుకొని తన నడికట్టులో దోపుకొంటుంటే, రూబేను ఏదో మధ్యస్థ మార్గం చెప్పేవాడిలా వారికి కనిపించినందువల్ల వారు రూబేను వైపే చూస్తూ ఊరకనే ఉన్నారు.

“రక్తము చిందింపవద్దు. దేవునికి మొఱ్ఱపెట్టే శక్తి రక్తానికి ఉందని మీకు తెలియదా? రక్తము చిందింపకుండా అతనికి హాని ఏమియు చేయక అడవిలో ఉన్న ఈ గుంటలో అతనిని పడ్రదోయండి. మనం వెళ్ళిపోయిన తర్వాత ఆకలికి వాడే చచ్చిపోతాడు. మీరు రక్తాపరాధము నుండి విమోచింపబడతారు. మీరు స్వయంగా హత్య చేయటం లేదు, కాబట్టి దోష నివారణ పొందుతారు” అని అన్నాడు రూబేను. మిగిలిన వారు ఆలోచించటం మొదలుపెట్టారు.

‘నిజమే కదా! మనం యోసేపును చంపటం లేదు. ఈ బావి అడవిలో ఉన్నది. అందువలన సాధారణంగా ఎవరూ ఇటు రారు. ఇందులో నీళ్ళు లేవు కనుక యోసేపు ఇక ఆకలికి, దప్పికకు తొందరలోనే, కొద్దిరోజులలోనే చచ్చిపోతాడు. మనం అతనిని చంపలేదు కనుక మనం పాపం చేయనట్లే! అంతేకాక మనం చంపివేస్తే, ఎప్పటికైనా ఈ నిజం బయటకు వస్తే మనం మాత్రమే తండ్రి యెదుట అపరాధులము అవుతాము. కానీ రూబేనన్నా, యూదా అన్న, నిర్దోషులై మన మీద నేరారోపణ చేస్తారు. అయితే పైకి ఎక్కిరాలేని ఈ గుంటలో మనం పడవేసినప్పుడు వాడు చనిపోతే ఇక్కడ ఉన్న వారందరి మీద దోషము ఉంటుందనుకున్నారు.

రూబేను ఆలోచించాడు ‘తాను చెప్పినట్లుగా చెయ్యటానికి వీళ్ళు ఒప్పుకున్నారు. యోసేపును వారు గుంటలో పడదోస్తారు. యోసేపుకు ప్రాణాపాయం ప్రస్తుతానికి తప్పిపోయింది. కాని యోసేపును ఆ గుంటలో నుండి బయటకు తీసి తండ్రి యొద్దకు క్షేమంగా పంపాలి. వాళ్ళు గుంటలో యోసేపును వేసిన తర్వాత వారికి తెలియకుండా మరలా యోసేపును బయటకు తీసి, తండ్రి యొద్దకు పంపాలంటే జెబూలూనును తీసుకొని వస్తే మంచిది’ అని అనుకున్నాడు.

పడమర దిక్కున వారున్న చోటుకి బయలుదేరే ముందు యూదాతో అంతా చెప్పాడు. ‘తాను త్వరగా వస్తానని ఈ లోపల యోసేపు వస్తే వీరు అతనిని ఈ గుంటలో జాగ్రత్తగా పెద్ద దెబ్బ తగలకుండా క్రిందికి విడిచేటట్లుగా చూడమని’ సలహా ఇచ్చి, గాడిద మీద ఎక్కి తొందరగా వారున్న కొండ వెనక్కి వెళ్ళిపోతే, కుడివైపు నుండి యోసేపు అన్నలను కనుగొన్నందుకు చాలా సంతోషంగా వస్తుండడం యూదా గమనించాడు.

యూదా తన పిన్నమ్మల నలుగురు పిల్లలను ఒక కంట కనిపెడుతూనే, మరియొక వైపున యోసేపును ఆహ్వానిస్తున్నట్లుగా లేచి “మీరు తొందరపడి మూర్ఖంగా ప్రవర్తించ వద్దు. మీ ఇష్టమే నెరవేరుతుంది కనుక మొరటుగా ప్రవర్తించకుండా ఉండండి” అని వారికి మంచిగానే చెప్తున్నట్లుగా, ఒకవేళ వారు తన మాట వ్యతిరేకించి ఏమి చెయ్యలేనట్లు జాగ్రత్త చేశాడు. ఇప్పుడు యూదా ఒక్కడే తెగించినా, మిగతా నలుగురు కొట్లాటకు దిగుతున్నట్లు అనిపించింది.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# అందమైన అబద్ధం



మనం టీ.వి.లోనో, థియేటర్‌లోనో సినిమా చూసే టప్పుడు తన్మయత్వంతో, సినిమాలో లీనమైపోయి చూస్తుంటాం. సినిమా అనేది నటన అని, మనం చూసేదంతా అబద్ధమనే దృష్టితో అస్సలు చూడం కాబట్టి సినిమాలో లీనమైపోయి నవ్వుతూ, ఏడుస్తూ చూస్తాము. ఒక మూడు గంటల అబద్ధం మనల్ని ఎంత ప్రభావితం చేస్తుందో కదా! ఏదెను తోటలో మధ్యలో దేవుడు వేసిన మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలమును హవ్వ ఎన్నోసార్లు చూచినప్పటికీ అందంగా కనబడని పండు సాతాను హవ్వతో చెప్పిన ఒక అందమైన అబద్ధంతో, చూపునకు రమ్యంగా అందంగా కనబడటంతో పాపంలో పడింది. ఈ లోకమంతా అబద్ధాన్నే నమ్ముతుంది. అబద్ధము, నటన అయిన సినిమాకి మనుష్యులు ఎలా ఆకర్షితులై సినిమాలో లీనమైపోతున్నారో, అలాగే ఈలోక నటనకు కూడా మనుష్యులు ఆకర్షితులై లోకాన్ని నమ్ముతున్నారు. ఈ లోకమనేది నటన అని తెలీక దానిని అనుభవించడానికి మనుష్యులు లోకానికి బానిసలైపోతున్నారు. *‘ఈ లోకము అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టును ఉండవలెను; ఏలయనగా ఈ లోకపు నటన గతించుచున్నది’ (1కొరింథీ. 7:31).* ఈ లోకమనేది ఎండమావిలాంటిది. ఎండమావిలో నీళ్ళు ఉండటం ఎంత అబద్ధమో, ఈ లోకంలో ఏదో అనుభవించాలనుకుంటే, ఏదో సాధించాలనుకుంటే అది అబద్ధమే అవుతుంది. ఈ లోకమహిమ, దానిలోని అందాలన్నీ అబద్ధమే. మనుష్యులను దేవుని నుండి దూరం చేయడానికి సాతాను రంగుల ప్రపంచాన్ని సృష్టించి మనుష్యుల ముందు పెట్టింది. ఇదొక మాయా ప్రపంచం. ఖరీదైన వస్తువులతో అలంకరించబడిన విలాసవంతమైన పెద్ద పెద్ద బిల్డింగులు, వాటికి రంగురంగుల లైట్లు, వెడల్పైన రోడ్లు, విలాసవంతమైన కార్లు, మెట్రోరైళ్ళు, విమానాలు, రోజుకో కొత్త ఫ్యాషన్‌తో వేసుకున్నారా లేదా అన్నట్లు ఉండే డ్రస్సులు వేసుకొని తిరిగే మనుష్యులు, క్లబ్బులు, పబ్బులు, మాల్స్, రెస్టారెంట్లు, బిర్యానీలు, పిజ్జాలు ఒక్కటేంటి చెప్పుకుంటూపోతే విసుగొచ్చే టన్ని వింతలు, విశేషాలతో సృష్టించిన ఈ మాయా ప్రపంచం లోకి మనిషి ఒక్కసారి అడుగుపెట్టాడంటే ఇంక దేవున్ని మర్చిపోవాల్సిందే. ప్రస్తుతం జరుగుతుంది కూడా అదే. ఈ ప్రపంచాన్ని అనుభవించటానికి ఎంత డబ్బు అయినా సరిపోదు. అందుకే మనిషి ఇరవైనాలుగ్గంటలూ డబ్బు సంపాదించే పనిలోనే ఉన్నాడు. ఇలాంటి మాయా ప్రపంచం మాకొద్దు అనేవాళ్ళు ఒక్కళ్ళనైనా, క్రైస్తవులలో దేవునిబిడ్డలని చెప్పుకొనే వాళ్ళైనా, దేవుని పని చేస్తున్నామని చెప్పుకొనే పాస్టర్లనైనా సరే చూపించగలరా? అయితే ఇవన్నీ అనుభవించటం తప్పంటారా? అని అనుకోవచ్చు. ఇవన్నీ మనం సాతాను నుండి కాకుండా దేవుని నుండి పొందగలిగితే తప్పు కాదు. ఎందుకంటే, ఈ లోకరాజ్యముల మహిమ సాతానుకు అప్పగింపబడింది (లూకా 4:6). దేవునియందు భయభక్తులు కలిగి, దేవున్ని ప్రేమించే వారు ఇవన్నీ కోరుకోరు. ఈ మాయాలోకపు అందమైన అబద్ధాన్ని, ఈలోక నటనను కోరుకొనే వారు దేవున్ని ప్రేమించలేరు. దేవున్ని బతిమాలి, గోజాడి, ఏడ్చి దేవుని ద్వారా సంపాదించుకున్నా సరే, వాటి అంతం నరకమే. ఈ లోకసుఖాలను తనకిష్ట మొచ్చినట్లు అనుభవించిన ధనవంతుడు (లూకా 16:24) నరకంలో ఎలా దాన్స్ చేశాడో మన గతీ అంతే. ఐనా పర్వాలేదనుకుంటే మీ ఖర్మ. గో టు హెల్.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9440217726**

సీరియల్

# మిక్కిలి సాత్వికుడు

**- కొడవటికంటి**

**(మోషే జీవిత చరిత్ర)**

మోషే ప్రార్థించగా దేవుడు సర్పము వంటి ప్రతిమను చేసి స్థంభము పై నిలువబెట్టుము పాము కరచిన వారు దానిని నిదానించి చూచిన బ్రతుకుదురని చెప్పెను. మోషే ఇత్తడి సర్పమును స్థంభముపై నిలువబెట్టగా, పాము కరచినను విశ్వాసముతో దానిని చూచినవారందరూ బ్రతికిరి.

ఇశ్రాయేలీయులు ఎదోమును చుట్టి అరణ్యమార్గమున అమోరీయుల దేశమును చేరి అమోరీయుల రాజైన సీహోను పొలిమేరలు దాటనివ్వనందున యెహోవా సెలవిచ్చిన ప్రకారం యుద్ధము చేసి అమోరీయుల రాజైన సీహోనును ఆ తరువాత బాషాను రాజైన ఓగును ఓడించి వారి దేశమును స్వతంత్రించుకొని మోయాబు మైదానమును చేరారు.

మోయాబు రాజైన బాలాకు భూతలమును కప్పివేసిన ట్లున్న ఇశ్రాయేలును చూసి భయపడెను. ఇశ్రాయేలీయులు సీహోను ఓగు రాజలను ఓడించారని విని పెతోరులోని బిలాముకు కబురు పంపెను.

బిలాము పెతోరు వాసి. ఇతని తండ్రి పేరు బెయోరు. ఆ కాలంలో బిలాము దీవించువారు దీవింపబడుదురని, బిలాము శపించువారు శపింపబడుదురని మోయాబులో ప్రతీతి. నిజానికి బిలాము ఒక సోదె చెప్పు వాడు.

మోయాబు మైదానము చేరిన ఇశ్రాయేలీయులను శపించు నిమిత్తం తన వద్దకు రావలసిందిగా మనవి చేయుటకు మోయాబు రాజైన బాలాకు బిలామును తీసుకొని వచ్చుటకు మనుష్యులను సొమ్ముతో పంపెను.

యెహోవా బిలామును, మోయాబు పెద్దలతో వెళ్ళుటకు అనుమతినివ్వక పోవడంతో బిలాము తన వద్దకు వచ్చిన వారిని పంపివేసెను. బిలాము బాలాకు ధనమును ఆశించి వెళ్ళదలచినను యెహోవా అనుమతి లేక వారితో వెళ్ళలేకుండెను. బాలాకు మరల తన మనుష్యులను పంపగా యెహోవా బిలాముతో నీవు ఆ మనుష్యులతో వెళ్ళినను ఇశ్రాయేలు ప్రజలను శపించక దీవించ వలసినదిగా ఆజ్ఞాపించెను.

బిలాము తన గాడిదనెక్కి బయలుదేరగా యెహోవా దూత ఖడ్గము ధరించి దారి మధ్యలో నిలబడగా, గాడిద దారి విడిచి పొలములోనికి పోయెను దారి మరల్చవలెనని బిలాము గాడిదను కొట్టెను. దూత అటు ఇటు గోడలు గల ద్రాక్షలతోటను నిలువబడగా గాడిద బిలాము కాలును గోడకు అదిమినందున మరల అతడు గాడిదను కొట్టెను. మార్గములో ఉన్న దూతను చూసి గాడిద కూలబడగా బిలాము మరల గాడిదను కొట్టెను. అందుకు గాడిద నేనేమి చేసితినని ముమ్మారు నన్ను కొట్టితివి అన్నది. గాడిదకు స్వరము కలుగుట చూచిన బిలాము కన్నులు తెరవబడెను. కత్తి దూసి మార్గ మధ్యలో నిలువబడిన దూతను చూసిన బిలాము సాగిలపడెను. దేవుడు ఇశ్రాయేలీయులను శపించుటకు అనుమతివ్వక దీవించెను. కాబట్టి బిలాము ఇశ్రాయేలీయులను దీవించెను.

జనులు షిత్తీములో ఉన్నప్పుడు మోయాబు స్త్రీలను మోహించి వారితో వ్యభిచారము చేసిరి. అంతేకాక ఆ స్త్రీల నిమిత్తం వారి దేవతల బలులకు హాజరవ్వడం, ఆ దేవతలకు నమస్కరించడం చేసిరి. అప్పుడు యెహోవా కోపము ఇశ్రాయేలీయుల మీద రగులుకొనెను. దేవుడు మోషేతో మోయాబు దేవతయైన బయల్పెయోరుతో కలుసుకొనిన ప్రతి వానిని ఉరి తీయవలసినదిగా ఆజ్ఞాపించెను. జనులందరూ ఏడ్చుచుండగా షిమ్యోనీయుడును సాలూ కుమారుడునైన జిమ్రీ, మిద్యానీయురాలైన కొజ్బీ అనే స్త్రీని పాళెము లోనికి తీసుకొనిరాగా అహరోను మనుమడును ఎలియాజరు కుమారుడునైన ఫీనెహాసు ఈటె చేత పట్టుకొని వారి వెంబడి వెళ్ళి వారిద్దరి కడుపులో గుండా దూసిపోవునట్లు పొడిచెను. అప్పుడు తెగులు నిలిచిపోయెను. తెగులు కారణంగా అప్పటికే ఇరవైనాలుగు వేల మంది చనిపోయిరి.

దేవుడు ఫీనెహాసు దేవుని యందు ఆసక్తి కలిగి దేవుడు ఓర్వలేనిదానిని తానును ఓర్వలేకపోవుటను బట్టి చేసిన ప్రాయశ్చిత్తము నిమిత్తము అతనితో నిత్య యాజక నిబంధన చేసెను.

ఆ తరువాత దేవుడు మోషేతోను, యాజకుడైన ఎలియాజరుతోను ఇశ్రాయేలీయులను లెక్కించమని చెప్పగా వారి వారి గోత్రముల ప్రకారం ఇరువది ఏండ్ల కంటే పై వయసు కలిగి లెక్కింపబడిన ఇశ్రాయేలీయుల సంఖ్య ఆరు లక్షల వెయ్యిన్ని ఏడు వందలు. మోషే అహరోనులు సీనాయి అరణ్యములో లెక్కించినపడు ఉన్న వారిలో ఒక్కడైనను వీరిలో ఉండలేదు. (కాలేబు యెహోషువ తప్ప)

యెహోవా మోషేతో "నీవు అబారీము కొండ ఎక్కి ఇశ్రాయేలీయులకు నేనివ్వబోయే దేశాన్ని చూడు ఆ తరువాత నీవు కూడా నీ స్వజనులలో చేర్చబడుదువు" అనెను.

మోషే యెహోవాతో "యెహోవా, సమస్త మానవుల ఆత్మలకు దేవా, కాపరి లేని గొఱ్ఱెల వలె ఉండకుండునట్లు సమర్థుడైన వానిని నాయకునిగా నియమించుము" అనెను

దేవుడైన యెహోవా తనకు ఆజ్ఞాపించినట్లు మోషే యెహోషువను యాజకుడైన ఎలియాజరు ఎదుటను, సర్వసమాజము ఎదుటను నిలువబెట్టి అతని మీద చేతులుంచి ఇశ్రాయేలీయులను యొర్దాను అవతలకు నడిపించవలసినదిగా ఆజ్ఞాపించెను.

ఆ సమయంలో మోషే యెహోవాను ఈ విధంగా బ్రతిమాలాడు " యెహోవా నా ప్రభువా, నేను నీ సేవకుడిని, నీవు చేసే ఆశ్చర్యకరమైన, శక్తివంతమైన విషయాలలో కొద్ది భాగం మాత్రమే నీవు నాకు చూపించావు అని నాకు తెలుసు. నీవు చేసిన శక్తి వంతమైన మహత్కార్యాలను చేయగల దేవుడు ఆకాశంలో గాని భూమి మీదగాని లేదు. యొర్దాను నదికి అవతల ప్రక్కనున్న ఆ మంచి దేశాన్ని సౌందర్య వంతమైన ఆ కొండ దేశాన్ని లెబోనానును చూడదానికి నన్ను అవతలకు దాటి వెళ్ళనియ్యి అని నేను నీకు మనవి చేస్తున్నాను"

"కానీ ఇశ్రాయేలీయుల మధ్య మెరీబా నీళ్ళ విషయంలో మోషే దేవున్ని ఘనపరచనందున యెహోవా మోషే మీద కోపగించాడు. ఆయన మోషే మాట వినడానికి తిరస్కరించాడు. యెహోవా మోషేతో ఇలా చెప్పాడు " నీకిది చాలు. ఈ విషయం నాతో ఇంక చెప్పవద్దు. పిస్గా కొండ శిఖరం మీదకి వెళ్ళు తూర్పు పడమర ఉత్తరం దక్షిణము దిక్కులు చూడు. నీవు కళ్ళతో కనాను దేశాన్ని చూడవచ్చు గాని నీవు మాత్రం ఎన్నటికి యొర్దాను నది దాటి వెళ్ళజాలవు. నీవు తప్పక యెహోషువకు హెచ్చరికలు ఇవ్వాలి. అతడిని ప్రోత్సహించి బలపరచు. ఎందుకంటే ప్రజలను యెహోషువ యొర్దాను నది దాటిస్తాడు. దేశాన్ని స్వాధీనంచేసుకొని దానిలో నివశించేందుకు యెహోషువ వారిని నడిపిస్తాడు. ఆ దేశాన్నే నీవు చూస్తావు అంతే"

అందుచేత ఇశ్రాయేలీయులు బేత్పెయోరు అవతలి వైపు లోయలో నిలిచిపోయారు. మోషే చివరిసారిగా ఇశ్రాయేలీయులను పోగు చేసి వారితో ఇలా అన్నాడు " ఇశ్రాయేలీయులారా నేను మీకు ప్రభోదించే చట్టాలు ఆజ్ఞలు వినండి. వాటికి విధేయులవ్వండి. అప్పుడు మీరు బతికి, మీ పూర్వీకుల దేవుడైన యెహోవా మీకు ఇస్తున్న దేశంలో ప్రవేశించి దాన్ని స్వాధీనపరచుకోగలగుతారు. నేను మీకు ఆజ్ఞాపించిన వాటికి మీరేమి అదనంగా చేర్చకూడదు. నేను మీకు ఇచ్చిన మీ యెహోవా దేవుని ఆజ్ఞలకు మీరు విధేయులు కావాలి.

"బయలు పెయోరు వద్ద యెహోవా చేసింది మీరు చూశారు. అక్కడ బయలును వెంబడించిన వాళ్ళందరిని మీ దేవుడు నాశనం చేశాడు. అయితే మీ దేవుడైన యెహోవా వైపు నిలిచివున్న మీరంతా ఈనాడు బ్రతికి ఉన్నారు"

"చూడండి, నా దేవుడైన యెహోవా నాకు ఆజ్ఞాపించిన చట్టాలు, నియమాలు నేను మీకు ప్రభోదించాను. మీరు ఏ దేశంలోనైతే ప్రవేశించి, దానిని మీ స్వంతం చేసుకోబోతున్నారో ఆ దేశంలో మీరు ఈ చట్టాలకు విధేయులు కావాలని వాటిని నేను మీకు ప్రబోధించాను. ఈ ఆజ్ఞలకు జాగ్రత్తగా లోబడండి. అప్పుడే మీకు జ్ఞానం తెలివి ఉన్నట్టు ఇతర రాజ్యాల ప్రజలకు ఇది తెలియజేస్తుంది. ఆ దేశాల ప్రజలు ఈ ఆజ్ఞలను విన్నప్పుడు "నిజంగా ఈ గొప్ప రాజ్య ప్రజలు (ఇశ్రాయేలీయులు) జ్ఞానులు, తెలివి గలవారు అని చెబుతారు. **(సశేషం)**

స్త్రీల విభాగము

# సమరయ స్త్రీ (పోటీనా)

యోహాను సువార్తలో 'సమరయ స్త్రీ'గా పరిచయం చేయబడిన యవ్వనస్తురాలి పేరు (4వ అధ్యాయం) పోటీనా. యూదుల సంప్రదాయమునుసరించి బహిరంగ ప్రదేశాలలో స్త్రీ పురుషులు కలిసి మాట్లాడుకోకూడదు! కనీసం భార్యాభర్తలు కూడా సంభాషించుకోరాదు! అందులోను సమరయులతో యూదులు అసలు మాట్లాడకూడదు! స్త్రీ యెడల యూదుల నియమ నిబంధనలు వారి సంకుచిత స్వభావానికి నిదర్శనంగా, దైవిక లక్షణానికి విరుద్ధంగా వున్నాయి. ఒక విధంగా యేసు తన మానవ జీవితకాలంలో యూదుల ఆచార సంప్రదాయాలను పాటించనే లేదు! యేసు దైవ తనయుడు కాబట్టి సుంకరులతో కలిసి విందారగించాడు, యూదులు పాపులనుకున్న వారితో కలిసి భోజనం చేశాడు, విశ్రాంతి దినమును దైవ దినముగా భావించి రోగులను బాగుచేశాడు, అపరిశుద్ధులను తాకి స్వస్థపరిచాడు, 'సమరయ' అనే మాటను వినుటకు కూడా యిష్టపడని యూదులతో 'మంచి సమరయుని' ఉపమానం చెప్పాడు, బహిరంగంగా ఎందరో స్త్రీలతో మాట్లాడాడు. ఇప్పుడు యూదులకు నిషిద్ధ ప్రదేశమైన సమరయలో ప్రవేశించాడు (మత్తయి 10:5-7, లూకా 9:51-55). ఆనాటి నిబంధన ప్రకారం, ఒకవేళ ఎవరైనా తప్పని పరిస్థితుల్లో, సమరయలో ప్రవేశిస్తే ఆ మనుష్యుడు ఆ గ్రామ నాయకులను కలుసుకొని వారి అనుమతితోనే సమరయలో నివసించాలి, వారితో సంభాషించాలి! (మత్తయి 10:11-15) 'సమరయుల చేతి వంట తినిన వారిని నిషిద్ధమైన పంది మాంసమును తిన్నవారితో సమానమని వారితో సహవాసం చేసే వారు కారు' యూదులు. సమరయులతో సహవాసం చేసిన వారిని అన్యమతస్తులుగా (విగ్రహారాధికులు) ఎంచి వారిని వెలివేసే వారు యూదులు. సమరయులకు మృతుల పునరుత్థానంలో పాలుపంపులు లేవని వారు మరణించినా యూదయలో భూస్థాపితం చేసే వారు కాదు' యూదులు.

'గలిలయ నుండి యూదయ వెళ్లేందుకు అతి దగ్గర దారి సమరయ ద్వారానే. అయినా సమరయ గాలి కూడా సోకకూడదని యూదులు సమరయను దాట అసహ్యించుకొని, అతి దూరమైనా పెరియ ద్వారా చుట్టూ తిరిగి యెరూషలేము వెళ్లేవారు'. సమరయులంటే యూదుల దృష్టిలో అంటరాని వారు. కానీ సమరయులు మాత్రం యూదుల మనోభావాలను ఎంత మాత్రము కించపరచే వారు కాదు.

ఈ పరస్పర విరోధం తరతరాల నుండి పెరుగుతూనే వుంది గాని తరగలేదు. వీరి మధ్యనున్న ద్వేష భావం ఎక్కడ వరకు దారి తీసిందంటే – తండ్రియైన దేవుని ఆరాధించుటకు యెరూషలేము దేవాలయమును విసర్జించి అన్యదేవతను పూజించుటకు గెరిజీము పర్వతముపై ఒక ప్రత్యేక ఆలయమును నిర్మించారు. సమరయులు ఈ పర్వత దిగువ భాగముననే యాకోబు బావిని త్రవ్వించాడు (ఆది. 33:13-20).

ఆ యాకోబు బావి దగ్గర యేసు కలుసుకున్న ఆ సమరయ స్త్రీ అప్పటికి నిందు యవ్వనస్తురాలు, ఆమె పేరు ప్రతిష్ఠలు లేని కడు పేదరాలు. అయినా 'సమరయనే' తన పేరుగా మార్చుకున్న పౌరురాలు. తనకంటూ ఒక కుటుంబం వుండాలని ఆశించింది. కానీ పురుషాధిక్యం ఆమెను భార్య బంధానికి దూరం చేసి చరిత్రహీనురాలినిగా మార్చింది. అప్పటికే ఐదుమంది పురుషులతో తన జీవితమును పంచుకొని ఆరవ పురుషునితో సహజీవనం చేస్తుంది.

స్త్రీ దేహాన్ని సంతాన పునరుత్పత్తి క్షేత్రంగా భావించే లేవీ ఆచార ప్రకారం ఆమె గోత్ర వంశాంకురం కోసం ఒక కుటుంబంలోని సహోదరులకు భార్యగా మారిందా? (ఆది. 38:6,7; సంఖ్యా. 36:6,7; ద్వితీ. 25:5,6) లేక పేదరికంతో వృద్ధ ధనవంతులకు ధారాదత్తమైందా? (ఆనాటి వ్యవస్థలో పేద ఆడపిల్ల వివాహ విషయంలో ఈ ఆచారం ఉండేది) లేక యౌవనేచ్ఛలతో పురుష సాంగత్యాన్ని కోరుకొని చంచల జీవితానికి అలవాటు పడిందా? (హోషేయ. 4:12) (స్వయంకృత అపరాధం) ఈ

ప్రశ్నలకు సమాధానాలను చరిత్ర కనుగొనలేక పోయింది. యేసుతో ఆమె సంభాషణ, ఆమెను 'నైతిక విలువలను కోల్పోయిన స్త్రీ'గా సువార్తకు పరిచయం చేసింది. యేసు శిష్యుల అంతరంగ భావాలు ఆమెను 'పేరుమోసిన వేశ్య'గా పరిగణించాయి! ఏది ఏమైనా ఆమె నిజం చెప్పి యేసు ఎదుట 'పాపి'గా నిలబడిన యథార్థవంతురాలు. అందుకే యేసు 'ఆ సమరయ స్త్రీ'ని ప్రథమ సువార్త రథసారథి(ణి)గా మార్చు కున్నాడు. యేసును రక్షకునిగా (మెస్సయ్య) గుర్తించి, విశ్వసించి తన పట్టణ ప్రజలకు 'రక్షణ సువార్తను' (పునరుత్థాన శక్తి) ప్రకటించిన మొదటి వ్యక్తిగా, యేసు సిలువలో ప్రాణ త్యాగం చేసి, పునరుత్థానుడైన పిదప దక్షిణ ఆఫ్రికాకు యేసుని పరిచయం చేసిన సువార్త ప్రసంగీకురాలిగా, చరిత్రలో 'ప్రథమ క్రైస్తవురాలి'గా పేరు పొందిన ఆ సమరయ స్త్రీ, పరిశుద్ధులైన అపొస్తలులతో 'పోటీనా' (తేజోవతి, ప్రకాశజ్యోతి)గా నామ కరణం చేయబడింది.

యాకోబు బావి దగ్గర యేసుని కలుసుకున్నప్పటికే పోటీనా యిద్దరు పిల్లలకు తల్లి. ఆమె పెద్ద కుమారుని పేరు విక్టర్ (పోటీనాస్), చిన్న కుమారుని పేరు జోషియా. కుమార్తె వయ సున్న ఐదుగురు ఆడపిల్లలు ఎప్పుడు పోటీనాతో వుండేవారు. వారి పేర్లు అనాతోలా (అనస్టాసియా), పోత, పోటీస్, పరస్కెవా మరియు కైరియాకే. (ఈ ఐదుగురు ఆడ పిల్లలు పోటీనా సంతానమా లేక సహోదరీలా అనే విషయాన్ని చరిత్ర స్పష్టంగా వివరించలేక పోయింది) ఈ ఐదుగురితో పోటీనా దక్షిణ ఆఫ్రికా వెళ్లి కార్తేజి, స్మైర్నా పట్టణాలలో విస్తృతంగా సువార్త ప్రకటించి అనేకమందిని విశ్వాసపథంలో నడిపించింది.

'ప్రతీ మానవుడు జన్మతా పాపియని, చక్రవర్తులు, రాజులు, సామంతులు, సామాన్యులు ఏవ్వరైనా, ఎంతటి ఘను లైన పాపాన్ని పుణికి పుచ్చుకొని పుట్టిన వారేనని, ఆ పాప కూపము నుండి విముక్తికై, లోకం ఎదురు చూచిన రక్షకుడు యూదులలో వెలిశాడని, లోక పాపములను మోసికొని పోయి గొల్గొతాపై సిలువలో చిందించిన తన పరమ పవిత్రమైన పరిశుద్ధ రక్తముతో ప్రతీ పాపమును కడిగి వేశాడని, పాప ప్రక్షాళన చేసి పరలోకము చేర్చగ పరిశుద్ధుడు పునరుత్థానుడైన ప్రభువేనని, ఆయనే దేవునిచే అభిషేకింపబడిన యేసు! అని, ఆయన పాపములను పరిహసించడని, ఎంతటి ఘోర పాపినైనా క్షమిస్తాడని, ఆయన కృపను పొందాలంటే మానవుడైన (మహిమను కోల్పోయి మరణించే వాడు మానవుడు) వాడు తన పాపము నిమిత్తమై పరితపించి పశ్చాత్తాప పడి ప్రభు యేసుని సొంత రక్షకునిగా అంగీకరించి విశ్వాసముతో ఆయన రాజ్యము కొరకు నిరీక్షణ కలిగి వుండాలని" తన స్వానుభవ సాక్ష్యాన్ని చెబుతూ పరలోకానికి, యేసుప్రభువు సన్నిధికి ప్రేమ మార్గాన్ని చూపెట్టింది పోటీనా.

తన సమకాలికులు, అపొస్తలులైన యేసు శిష్యుల కంటే, పౌలు కంటే నిర్భయంగా రక్షణ సువార్తను ప్రకటించిన ఏకైక స్త్రీ పోటీనా. ఆమె ప్రసంగాలు యేసు ప్రేమకు ప్రతిరూపాలు. ఆమె బోధలు యేసు సిలువ త్యాగానికి దృశ్య కావ్యాలు. ఆమె కూడికలు ప్రతీ స్త్రీకి సేవాపరిచర్య సత్య వాక్య వాటికలు. ఆమె సదస్సులలో నిత్యజీవం ప్రవహిస్తూ వుండేది. ప్రథమంగా అపొస్తలుడైన ఫిలిప్పునకు ఆ పిదప మిగిలిన అపొస్తలులకు సమరయలో సువార్త ప్రకటించుటకు 'సమరయ స్త్రీగా' మార్గాన్ని సుగమం చేసిందీ 'పోటెనానే' (అపొ.కా. 8:5-25).

ఈ సువార్త సునాదం రోమాలో వున్న నికృష్ట చక్రవర్తి 'నీరో' (క్రీ.శ.54-68) చెవులకు మరణమృదంగంలా తాకింది. పోటీనాను కుటుంబ సమేతంగా రోమాకు తీసుకు రావల సిందిగా అట్టలియా పట్టణ అధికారైన సెబాస్టిన్‌కు ఉత్తరువులు జారీ చేశాడు. పోటీనా పరివారంతో సహా రోమాకు తీసుకు రాబడింది. పోటీనా పెద్దకుమారుడైన విక్టరుని రోమా ప్రభుత్వ పటాలంలో ఉద్యోగిగా నియమించి, అట్టలియా పట్టణంలో విధులను నిర్వహించవలసిందిగా ఆదేశించాడు నీరో. ఆ పట్టణంలో వున్న యేసు విశ్వాసులను మట్టుపెట్ట వలసిందిగా విక్టర్ని ఒత్తిడి చేశాడు సెబాస్టిన్, కానీ విక్టర్ అందుకు నిరాకరి స్తాడు. క్రైస్తవ విశ్వాసులను హింసించేందుకు నిరాకరించిన విక్టరుని నీరో కౄరత్వాన్ని వివరిస్తూ బెదిరిస్తాడు సెబాస్టిన్.

'ఓ! విక్టర్! మిమ్మును గురించి విశ్వసనీయమైన సమాచారం నా దగ్గర వుంది. పూర్వాశ్రమంలో మీ తల్లెవరో నాకు బాగా తెలుసు. మరణించిన ఒక యూదుణ్ణి దేవునిగా చేసి చక్రవర్తి

యైన నీరోకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతుంది మీ తల్లి. ఆమెననుసరిస్తే మీ అన్నదమ్ములిద్దరు కూడా నీరో క్రూరత్వానికి బలైపోక తప్పదు. నా మాట విని యేసుని మరచిపోయి నీరోని మహిమపరచండి బ్రతుకుతారు' అని తన మాటను పూర్తి చేయక ముందే మాటను కోల్పోయి మూగవాడయ్యాడు సెబాస్టిన్. విక్టర్ వేడుకొనిన ప్రార్థన ప్రభావము వలన మూడు రోజుల తర్వాత సెబాస్టిన్, 'యేసు నన్ను ఆహ్వానిస్తున్నాడు, నా నోటా తన మాటే పలకాలంటున్నాడు. విశ్వాసానికి విశ్వ రూపం యేసే! నిజమైన విశ్వాసి యేసునే విశ్వసిస్తాడు.' అంటూ బిగ్గరగా కేక ు వేస్తూ అందర్నీ ఆశ్చర్య పరిచాడు.

తిరిగి మాటను ప్రసాదించిన యేసుని కొనియాడుతూ తన యెడల జరిగిన ఈ మహత్కార్యానికి చకితుడై వెంటనే బాప్తిస్మం పొంది యేసు విశ్వాసుల కూటమిలో చేరిపోయాడు సెబాస్టిన్. ఈ విషయం తెలుసుకున్న నీరో, పోటీనాతో సహా తన యిద్దలు కుమారులను, తనతోపాటున్న ఐదుగురి ఆడపి ల్లలను, యేసు విశాసియైన సెబాస్టిన్ని విచారణ నిమిత్తమై ఆస్థానానికి రప్పించాడు. అతిక్రూరుడైన నీరో సెబాస్టిన్ మరియు పోటీనా యిద్దలు కుమారుల కన్నులను ఛిద్రం చేసి, వారిని అంధులుగా చేసి చెరసాలలో వేయించాడు. ఆ కసాయి కృత్యమును కన్నులార చూచిన పోటీనా 'కఠినాత్ముడా! ఓ నీరో! నా పిల్లల కన్నులు పెరికి వేసిన ఓ కసాయి! నా యేసు నీకు కరుణగల హృదయము దయచేయును గాక!' అంటూ ఆకాశం వైపు చేతులెత్తిన పోటీనా మణికట్టులను, తనతో వున్న ఐదుమంది స్త్రీల మణికట్టులను సమ్మెట సుత్తులతో నలగ గొట్టించాడు నీరో. అయినా వారికి ఎటువంటి అపాయం కలుగకపోవుట చూచి, వారందరిని కారాగారంలో బంధించి, తన కూతురైనా 'డొమినిన' పర్యవేక్షణలో వుంచాడు నీరో. ఆ కారాగారంలో వారిని ఖైదీలుగా కాక దైవ ప్రతినిధు లుగా ఆదరించింది డొమినిన. యేసు గురించి తెలిసికొన ఆసక్తి గలదై, నిత్యమూ వారి ప్రార్థనలలో పాల్గొనేది. తమని చంపబోతున్న తన తండ్రి నీరో శ్రేయస్సు కోరి వారు యేసుకు విన్నవించే ప్రార్థనలను విని, శత్రువుని సహితం ప్రేమించగల వారి హృదయ వాత్సల్యానికి ఆకర్షితురాలై యేసు గురించి క్షుణంగా తెలుసుకొన ఆసక్తురాలైంది. అప్పటి నుండి పోటీనా, డొమినినకు యేసు బోధను బోధించడం మొదలు పెట్టింది. ఆ కారాగారం ప్రార్థన మందిరంగా మారిపోయింది.

అంధులై చెరసాలలో వున్న సెబాస్టిన్, విక్టర్ (పోతీనాస్), జోషియా ప్రార్థనలు పరిమళ భరితములై, సువార్త సుమ సౌరభాలతో ఆ చెరసాను నింపాయి. వారి మనవులకు యేసు మహిమ, వెలుగు కిరణమై వారికి కనుచూపును ప్రసాదిం చింది. ఛిద్రమైన నయనాలలో సిలువ వెలుగుని చూచి నిర్ఘాంత పోయారు కావలివారు. చీకటి కనుగుంటలలో యేసుని చూచి విభ్రాంతి చెందారు బందీలు. ఆ చెరసాల సువార్త కుటీరంగా మారిపోయింది. ఈ విషయం తెలుసుకున్న డొమినిన యేసుని విశ్వసించి బాప్తిస్మం పొందింది! యేసు చేసిన ఈ మహాద్భుత కార్యాలకు పోటీనా మోకరిల్లి దేవ దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించింది.

ఊహించలేని అద్భుతం సంభవించినా, కన్న కూతురు యేసుని విశ్వసించినా, క్రైస్తవ ద్వేషియైన నీరో చెరసాల నుండి వారి ముగ్గురిని రప్పించి, తలక్రిందులుగా సిలువ వేయించి, తోలు వారులతో కొట్టించి చంపించాడు. కర్కశ హృదయుడు, వికృత మానసికరోగ పీడితుడైన నీరో రాజమందిరంలో కన్న కూతురైన డొమినినాను గృహ నిర్భధంలో బంధించాడు! సహ చారిణియైన పోతిదా కాళ్ళను, నేలకు వంచబడిన రెండు చెట్ల చిటారు కొమ్మలకు కట్టి పంగ చీల్చి చంపాడు. మిగిలిన నలుగురు పడతుల స్తనములను ఖండించి, తలలు నరికి వారి దేహాలను రాబంధులకు పారవేశాడు. ఎంతటి కర్కోటకుడా మానవ మృగమైన నీరో. ఈ హృదయ విదారక చిత్రహింసలను చూచి పోటీనా చలించి పోయింది. తాను ఎదుర్కొనబోతున్న మరణం బహు భయంకరమైనదని తెలిసి కూడా మరణంతో పోరాడుట కంటే, మరణించి యేసు సన్నిధిలో జీవించడం ఎంతో ధన్యత' అని ఆత్మానందంతో, సడలని విశ్వాసంతో యేసుని స్తుతించింది!

మోకరిల్లి ప్రార్థన చేస్తున్న పోటీనా ఒంటి చర్మాన్ని వొలిపించి, నీళ్లు లేని బురదగ పాడుబడిన బావిలో పడవేయిం

**...మిగతా 15వ పేజీలో**

సాక్ష్యము

# పద్మజరాణి

నా పేరు బంధం పద్మజరాణి. మాది కనిగిరి. యేసయ్య చేసిన మేలులను నేను మరువక మీ అందరి ముందు వాటిని తెలియజేయాలనే ఉద్దేశ్యంతో వ్రాస్తున్నాను.

నా శ్రమలో నాకు సమాధానం కలుగజేసి, నా దుఃఖమును ఓదార్పుగా చేసి నన్ను మరణ పడకలపై నుండి సజీవంగా లేవనెత్తినందుకు, దేవుని కొరకై జీవించుటకు ఈ గొప్ప తరుణంను నాకు దయచేసినందుకు దేవునికి వందనాలు చెల్లించుచున్నాను.

నా చిన్నతనంనుండి నేను మా తల్లిదండ్రుల దగ్గర గారాభంగా పెరిగాను. మా కుటుంబంలో అమ్మానాన్నలతో కలిపి మొత్తం తొమ్మిదిమందిమి. నేను ఆఖరిదానను. నా పైవారంతా బాగా చదువుకొని ఉద్యోగాలలో స్థిరపడ్డారు. నేను కూడ మంచి ఉద్యోగం చేయాలనే ఉద్దేశ్యతో నాకు ఇష్టం వచ్చిన చదువును చదువుకోవడం ప్రారంభించాను. నాకు 2002లో వివాహం అయింది. నా భర్తగారైన విజయ్‌గాంధి నాకు చదువులో మంచి సహకారం అందించారు. నేను యం.ఎ. బి.ఇ.డి., లైబ్రరి సైన్స్, కంప్యూటర్ సైన్స్ మొదలగు వాటన్నింటిలో పి.జి లు చేశాను. అయితే నేను తలంచినది దేవుని చిత్తం కాదేమో!

నేను చిన్నతనము నుండే దేవునిపై నమ్మకం, విశ్వాసం కలిగి జీవించేదాన్ని. ఒక క్రైస్తవ బిడ్డగా యౌవనకాలంలో కొన్ని ఆటుపోట్ల వలన సాతాను శోధనలో అనేక వాటిపై శ్రద్ద చూపేదాన్ని. కాని దేవుడు ఎప్పుడు నన్ను మరువలేదు. నన్ను ప్రతి విషయంలో కాపాడుతు వచ్చారు.

2002 లో వివాహం అయిన తరువాత మాకు 2004లో పాప పుట్టినది. మరలా 3 సం।।ల వరకు పిల్లలు కలుగలేదు. మొదటి పాపకు తోడుగా మరొక బిడ్డ కావాలని ప్రార్ధించగా దేవుడు వా ప్రార్ధనకు సమాధానంగా మరొక పాపను ఇచ్చారు. అయితే పాప అనేక లోపాలతో పుట్టినది. నేను చాలా ఏడ్చాను. హాస్పిటల్‌లో నేను పడుకొని బిడ్డను చూస్తు ఏడ్చుచూ 'దేవా తండ్రి నాకెందుకు ఇలాంటి బిడ్డను ఇచ్చావు. నా పరిస్థితి ఈ విధంగా ఎందుకయ్యింది? నేను ఇప్పుడేం చేయాలి? హన్నావలె నా హృదయమును కుమ్మరించుకొని విజ్ఞాపనలతో మొరపెడితినే, మరి నాకు ఇటువంటి బిడ్డనిచ్చావే? మరి ఈ బిడ్డను ఏంచేస్తావో నాకు తెలియదు తండ్రి నీవే నిర్ణయించు నేనైతే నాభారం నీపైనే వేస్తున్నాను' అని ఏడ్చి అలాగే నిద్రపోయాను.

నా కలలో యేసయ్య నాకు ప్రత్యక్షంగా కనబడి నా బిడ్డను తన ఒడిలోకి తీసుకొని తల నుండి కాళ్ళ వరకు నిమిరి తల ఊపి తన వెలుగును నాకు చూపించి వెళ్ళి పోవడం నా కళ్ళారా చూశాను. అప్పటి నుండి బిడ్డను చూసి ఎవరు బాధపడినా నాలో దేవుడు ఏదో ఒకటి చేస్తాడని ఏదో తెలియని నిర్ణయం. అలా ఆలోచిస్తు పడుకొని కృంగి పోతూ ఏడ్చుచూ దేవుని ప్రార్ధించేదాన్ని. ఒకరోజు అనగా 2009 డిసెంబరు 23వ తేదిన ఏడ్చుచూ దేవా! నేను బ్రతిమిలాడి ప్రార్ధించితే నా ప్రార్ధన ఆలకించి బిడ్డను ఇచ్చావు. మరి ఇటువంటి బిడ్డను ఎందుకు ఇచ్చావు, నా పాపములు, నా దోషాలు నీ పాదసన్నిధిలో ఒప్పుకున్నాను కదా తండ్రి మరి నాకు ఈ శిక్ష ఏమిటి అని పాపను రెండు చేతులతో పైకెత్తి పట్టుకొని నీవు ఏమి కోరుతున్నావో నాకు తెలియదు తండ్రి నా హృదయం నీకు సమర్పించుకొని కన్నీటితో ప్రార్ధించుచున్నాను. నా కన్నీటిని నీ కవిలలో చూసి నా దుఃఖమునకు సమాధానం కలుగజేయి, ఇంత వరకు నాకు అన్ని విధాల సహాయంచేసి ఏ కొదువ లేకుండా చేశావు. ఇంకా నా తప్పులు ఏమైనా ఉంటే క్షమించండి. అందరూ నీ పుట్టిన రోజును జరుపుకుంటుంటే నాకు నీవు ఇచ్చిన ఈ పుట్టిన బిడ్డను చూసి నీ పుట్టినరోజు ఎలా జరుపుకోగలను తండ్రి అని వేదుకొంటున్న సమయంలో దేవుడు నా నోటివెంట " నీ సేవకై ట్రైనింగ్

చేస్తాను" అని ఒప్పుకోవడం నా నోటి వెంట వచ్చింది. వెంటనే నా భారమంతా దిగిపోయి ప్రశాంతంగా ఏడ్చాను.

ఆ రోజు రాత్రికి పాపకి పాలు తాపించి నిద్రపుచ్చి నేను నిద్రపోయాను. తెల్లవారింది, అది డిసెంబరు 24. యేసయ్య నా బిడ్డను తీసుకొనివెళ్ళాడు. నిద్రలోనే ఆ బిడ్డ వెళ్ళిపోయింది. అప్పుడు  నేను ఏడుస్తుంటే దేవుడు నాకు కనబడి ఇటువంటి బిడ్డలను నేను చూసుకోగలను నశించిపోతున్న ఆత్మలను మార్చు అను శబ్ధం నాకు స్పష్టంగా  తెలియజేయడం జరిగింది. మా తల్లిదండ్రుల ప్రార్ధన వలన నేను దేవుని ద్వారా దీవించ బడితే నా ప్రార్ధనను దేవుడు దీవించి నన్ను తన సేవకై వాడుకోవాలని దేవుని చిత్తమైవున్న దనుకొని నేను ట్రైనింగ్ కోసం ఎదురుచూస్తు వేరే ఉద్యోగంలో చేరి ఆలస్యం చేశాను. మరలా నాకు భయంకరమైన మరణం ఎదురైనది. కాని దేవుడు మరలా తన బిడ్డగా తన సేవకు వాడుకోవాలని గుర్తు చేస్తూ నన్ను మరణపడకపై నుండి కాపాడారు.

అది ఏమిటంటే ఫిబ్రవరి 6వ తేదిన నాకు ఊపిరితిత్తు లలో వ్యాధి వచ్చింది. దాని వలన రక్తం మొత్తం చెడిపోయి గుండె పెరిగి కాళ్ళు, చేతులు వాచి నిద్రలేకుండా ప్రాణా పాయస్థితిలో అమృత హాస్పిటల్ చేరాను. అయితే నా పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు ఐ.సి.యులో ఉంచారు. బయట మా వాళ్లంతా అన్ని చర్చిలకు, అన్ని మినిస్ట్రీలకు ఫోన్లు చేసి ప్రార్ధించుమన్నారు. లోపల ఐదారుగురు డాక్టర్ల పర్యవేక్షణలో నాకు అన్ని టెస్ట్లు చేస్తున్నారు. ఆ తరువాత మూడు రోజులకు నేను కళ్ళు తెరిచాను. అయితే నా పల్స్ పడి పోయింది, రక్తం లేదు, కోమాలోకి వెళ్ళె పరిస్థితులలో డాక్టర్స్ కరెంట్ షాక్ పెట్టసాగారు. 4,5 సార్లు పెట్టారు. ఆ తరువాత నేను నిద్రపోయానంట. మరుసటి రోజు డాక్టర్లు నీవు చాలా అదృష్టవంతురాలివి సమయానికి షాక్ ఇవ్వడం వలన కోలుకున్నావు అన్నారు.

ఆ తరువాత మరలా రెండు రోజులకు రెండవసారి సీరియస్ అవుతున్న సమయంలో నేను దేవా, నాకేమైనది, నాకేమైనా అయితే నా బిడ్డ, నా భర్త దిక్కులేని వారు అవుతారు. తండ్రి ఒకవేళ నన్ను తీసుకొంటే నీ పరలోక రాజ్యంలో చేర్చుకో అని నా పాపములన్ని కడిగివేసి నన్ను క్షమించు, నన్ను బ్రతికించు అని ప్రార్ధించి బిగ్గరగా దేవుని పాటలు పాడటం మొదలు పెట్టాను. ఆ స్థితిలో కూడ దేవుని పాటలు పాడుతుంటే ఐ.సి.యులో పాడకూడదని తెలిసినా డాక్టర్లు కూడ ఆమె చనిపోతుంది కనుక పాడుకోమని వదిలేశారు. నా పాటల వలన ప్రక్కన ఉన్న పేషంట్స్ చాలామంది ప్రార్ధించి మారు మనస్సు పొందారు. నర్సులు, కాంపౌండర్లు కూడా ప్రార్ధించారు. ఆ తరువాత తెల్లవారు జామున మూడున్నరకు  మూడవసారి సీరియస్ అయితే మా వాళ్ళందరిని పిలిపించి 25 సార్లు కరెంట్ షాక్ పెట్టారు. అలా షాక్ పెట్టేటప్పుడు యేసయ్య నాకు ప్రత్యక్షమై తన బూరతో నా నోటిలో ఊదటం జరిగింది. అప్పుడు కోమాలో నుండి నిద్రలోకి వెళ్లాను. ఆ ముందు రోజు నేను చనిపోతానని నా కూతురుని పిలిపించుకొని ప్రార్ధించుకున్నాను. నా బిడ్డ ప్రార్ధన, నా భర్త ప్రార్ధన, మా అత్త, అక్కగార్ల ప్రార్ధనలను విన్న దేవుని కృపవలన బ్రతికాను. ఆ తరువాత పదిరోజులు హాస్పటల్లో ఉన్నప్పుడు డాక్టర్లు మేమైతే నిన్ను బ్రతికించలేదమ్మా! నీవు నమ్మిన నీ దేవుడే నిన్ను బ్రతికిం చారు. అంతా దేవుని కృప అంటూ వాళ్ళు ఆశ్చర్యపోయారు. నా జీవితంలో జరిగిన ఈ ఆశ్చర్యకార్యమును బట్టి కొందరు డాక్టర్లు, నర్సులు మారుమనస్సు పొందారు.

22 రోజులకు హాస్పటల్నుండి వచ్చి ఆరు నెలలు బెడ్ రెస్ట్ తీసుకున్నాను. ఆ తరువాత మూడు నెలలకు వెళ్ళి పరీక్షలు చేయించుకుంటె పెరిగిన నా గుండె యధాస్థానం లోకి వచ్చినదని తెలిసింది. చాలా ఆశ్చర్యం. ఎందుకంటే అలా పెరిగిన గుండె మామూలుగా రాదు. జీవితాంతం మందులు వాడాలి. ఇక మందులతో పనిలేదు. ఇది దేవుని అద్భుతక్రియ అని చెప్పారు.

దేవుడు తన జీవాత్మను బూరతో నా మీద ఊది సంపూర్ణ స్వస్థతను చేకూర్చాడు. నా జీవితాంతం దేవుని సేవకై వాడ బడుటకు నా గురించి , నా కుటుంబం గురించి ప్రార్ధించండి. దేవునికి నా కృతజ్ఞతలు. ఆమేన్...

# ఉత్సాహముగా ఇచ్చుట...

ఇచ్చుట అనగా త్యాగము. త్యాగములో ప్రేమ ఉంటుంది. అంటే ఇచ్చుట అనగా ప్రేమించుట. ఇచ్చే గుణం లేనివారు ఏ మాత్రము త్యాగము చెయ్యలేరు. ప్రేమించని వారు ఏ త్యాగానికి సిద్ధపడరు. దేవుడు తన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకంలోని పాపులను రక్షించుటకు ఇచ్చి వేశాడు అనగా త్యాగము చేశాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను (యేసుక్రీస్తును) అనుగ్రహించెను (యోహాను 3:16).

"దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (1కొరింథీ.9:7). కయీను, హేబెలు దేవునికి అర్పణ తీసుకెళ్ళినప్పుడు దేవుడు కయీను అర్పణ అంగీకరించక పోవడానికి కారణం ఎంటో బైబిల్లో పేర్కొనకపోయినప్పటికీ, దేవునికి ఇచ్చే విషయంలో అతనిలో ఏదో లోపం కనుగొన్నాడు దేవుడు. ఒకవేళ తల్లిదండ్రులైన ఆదాము హవ్వల బలవంతం మీదనో, లేక వాడుకగా తీసుకెళ్ళాలి కాబట్టి తీసుకెళ్దాము అనుకొన్నాడేమో. మొత్తం మీద కయీను హృదయం దేవునికి అనుకూలంగా, సంతోషంగా లేదని మనకు అర్ధమవుతుంది. కాబట్టి దేవునికి ఇచ్చే విషయంలో మన హృదయం ఎలా స్పందిస్తుందో మనకి ఖచ్చితంగా తెలుస్తుంది. దేవున్ని ప్రేమించే వారు దేవుని కొరకు తన ధనమును, తన సమయాన్ని ఇవ్వడానికి ఏ మాత్రం వెను కాడరు. కొంతమంది అయితే సమయం అయితే ఇస్తారు కాని, ధనమును మాత్రము ఇవ్వరు. అందుకే యేసుప్రభువు మత్తయి సువార్త 6:24లో "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" అని చెప్పాడు. దేవునికి ప్రత్యర్థిగా సిరిని (డబ్బుని) దేవుడు ఉదహరించాడంటే, మనుష్యులు డబ్బుని ఎంతగా ప్రేమిస్తారో దేవునికి తెలుసు.

నేను ఈ ఆర్టికల్ రాసేటప్పుడు కర్నూలులో ఒక పాస్టరు గారు దగ్గర నుండి నాకు ఫోన్ వచ్చింది. ఆయన 'పత్రికకు చందా ఎలా పంపించాలి?' అని అడిగాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే గత నెలలో 500 మందికి పత్రికలో మనియార్డరు ఫారం పెట్టి పంపించాము. బహుశా ఆయనకు వెళ్ళిన పత్రికలో మనియార్డరు ఫారం ఉండి ఉండదు. మామూలుగా అయితే ఎవరికి వారే పోస్ట్ ఆఫీసుకి వెళ్ళి మనియార్డరు ఫారం కొనుక్కొని పూర్తిచేసి చందా పంపించాలి. కరెంటు బిల్లులు కట్టటానికి, ఫోన్ బిల్లులు కట్టటానికి, రేషను తెచ్చుకోచ్చుడానికి, ఇంకా వాళ్ళకి ప్రాధాన్య మైన విషయాలకి ఎంతసేపైనా క్యూలో నిలబడి వాళ్ళ పని పూర్తి చేసుకుంటారు. అలాంటిది దేవుని పని కొరకు, దేవునికి ఇవ్వడానికి కొంతదూరం నడవటానికిగాని, ఓపిగ్గా క్యూలో నిలబడటానికి గాని ఇష్టపడరు. సంవత్సర చందా 350/- రూపాయలు కట్టడం అదేమంత భారం కాదుగాని, దేవునికి ఇచ్చే విషయంలో ఉత్సాహం లేక పోవడం, ఒకవేళ ఇవ్వాలని ఉన్నా ఇవ్వలేకపోవడమనేది సాతాను దేవుని పనికి ఆటంకం కలిగిస్తుంది అన్న విషయం గ్రహించలేకపోవడం కారణాలు అవుతాయి. అలా కాకపోతే 500 మందికి మనియార్డరు ఫారాలు పంపిస్తే పట్టుమని పదిమంది కూడా వాటిని ఉపయోగించుకోకపోవడం చూస్తే సాతావు ఎంత బలంగా దేవుని పనిని అడ్డుకుంటుందో గమనించగలం. **ఒక సంఘమును నడిపిస్తున్న వారిని పోషించాల్సిన బాధ్యత సంఘ సభ్యుల మీద ఎలా ఉంటుందో, ఒక పత్రికను నడిపించే వారిని ప్రోత్సహించి, దేవుని వాక్యము వ్యాప్తి చెందుటకు చందాకట్టి సహకరించాల్సిన బాధ్యత పాఠకుల మీద ఉంది అన్నది సత్యము.** పత్రికను పోషించుట ద్వారా పాఠకులు దేవుని ఆశీర్వాదాలకు పాత్రులు కాగలరు. దేవునికి ఇచ్చుట అనేది దేవున్ని ప్రేమించుటలో భాగమైతే మరి మనం దేవున్ని

ప్రేమిస్తున్నామో మనకి ఎలా తెలుస్తుంది? దేవునికి ఇవ్వడం ద్వారానే కదా! అది ఉత్సాహంతో కూడుకొని ఉంటే మరి ఎక్కువగా ప్రేమిస్తున్నట్లు.

మరి ఆ ఉత్సాహం ఎలా ఉంటుందో తెలుసుకుందాం. దేవునికి ఇచ్చే విషయంలో హేబెలు యొక్క ఉత్సాహం మనం లోతుగా పరిశీలించాలి. హేబెలు తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను (ఆది.4:4). మంద అంటే కొన్ని వందల గొఱ్ఱెలు ఉండొచ్చు. వాటిలో ఏవి తొలిసారిగా చూలు కడుతున్నాయో గుర్తు పెట్టుకోవాలి. అవి ఈనిన తరువాత ఆ పుట్టిన వాటిని మరలా గుర్తుపెట్టు కోవాలి. అంటే తొలిసారిగా పుట్టినవి కాకుండా, తర్వాత పుట్టినవి కూడా ఉంటాయి కదా, అవి, ఇవి కలిసిపోకుండా చూసుకోవాలి. తొలిచూలున పుట్టిన వాటిలో కూడా క్రొవ్విన వాటిని అంటే నాణ్యమైన వాటిని దేవునికి ఇవ్వడం కోసం వేరుగా ఉంచాలి. అలా కాకుండా, దేవునికి ఇవ్వవలసిన సమయం వచ్చినప్పుడు ఏవో చేతికి అందినవి నాలుగు తీసుకొని ఇచ్చే పనైతే ఇంత కష్టపడాల్సి అవసరం హేబెలుకి వచ్చేది కాదు. అయితే దేవునికి యిచ్చే విషయం ఎంతో శ్రద్ధ చూపించాడు హేబెలు. అంటే ఆసక్తి, ఉత్సాహం చూపించాడు. అందుకే దేవుడు హేబెలు అర్పణ అంగీకరించాడు. "ఉత్సాహముగా యిచ్చే వారిని దేవుడు ప్రేమిస్తాడు".

మరి మన హృదయము ఎలా ఉంది? మనది హేబెలు లాంటి హృదయమా? కయీనులాంటి హృదయమా? అది మనకే తెలుస్తుంది. ధనమును ప్రేమించేవారు దేవున్ని ప్రేమించలేరు. ధనాపేక్ష (ధనమును ప్రేమించడం) సమస్త మైన కీడులకు మూలము (1తిమో.6:10) కాబట్టి ఆ ధనమును దేవుని చేతిలో పెట్టడం వలన మనం కీడు నుండి తప్పించుకుంటాము. మన ధనమును దేవుని కార్యములకు ఖర్చు చేయటం వలన పరలోకరాజ్యములో మనం ధనమును దాచుకుంటాము (మత్తయి 6:20). దేవుడు మిమ్మును మీ కుటుంబాలను ఆశీర్వదించి, మీ ప్రతి అవసరతను తీర్చాలని ప్రార్థిస్తున్నాము.

**11వ పేజీ తరువాయి...**

చాడు నియంతయైన నీరో. ఆ పాడుబడిన బావిలో నిద్రాహారాలు లేక ఇరువై రోజులు ప్రార్థన చేస్తూనే వుంది పోటీనా. పోటీనా ఇంకా బ్రతికే వుందనే సమాచారం అందుకున్న నీరో, ఆమెను బావిలో నుండి పైకి తీసి, చర్మరహిత ఆమె దేహాన్ని మండు టెండలో నిలువబెట్టి 'ఓ! యేసు దాసీ! నా విగ్రహాలకు దాసోహమై నాకు మ్రొక్కు నీకు ప్రాణభిక్ష పెడతాను.' అంటూ వికృతంగా వికటాట్టహాసం చేశాడు నీరో. ఊహించని విధంగా పోటీనా కాంద్రించి నీరో ముఖం పై ఉమ్మి వేసి ఉగ్రురాలై 'ఉన్మాదుడా! జీవము లేని నీకు, నీ విగ్రహాలకు తలవంచి నమస్కరిస్తానని ఎలా అనుకున్నావు? బుద్ధిహీనుడా! నిత్యజీవదాతయైన యేసుని పరిత్యజించి ఆత్మలేని నీకు, నీ విగ్రహాలకు అర్పణ సమర్పణలు చేస్తానని ఎలా ఊహించావు? నికృష్టుడా! నీ పరిపాలనలో బ్రతుకుట కంటే యేసుకు సాక్షిగా మరణించి యేసు పాదాల చెంత జీవించడం ఎంతో ధన్యత, ఎంతో శ్రేయస్కరం. బావి దగ్గరే నా యేసయ్యను కలుసుకున్నాను నేను. బావిలోనే నా మెస్సయాలో లీనమైపోతాను. తోలు లేని నా ఈ దేహానికి నా ఆత్మే నిండైన తోరణం. నీళ్లు లేని ఆ బావే నా నిత్యజీవానికి వేదిక. నీవు హంతకుడవే గాక యేసుని మరల మరల సిలువ వేస్తున్న ద్రోహివి.' అంటూ సొమ్మసిల్లి నేల కొరిగి పోయింది పోటీనా యెముకల గూడు. కొన ఊపిరితో వున్న పోటీనాను అదే బావిలో విసిరివేయించాడు నీరో. ఆ బావిలో నిమిళిత నేత్రియై మౌనంగా తన ఆత్మను యేసుకు అప్పగించి, శాశ్వతంగా కన్ను మూసింది పోటీనా (క్రీ.శ.66). యాకోబులో ఉదయిం చిన నక్షత్రమును తిలకించిన సమరయ నక్షత్రం పరలోకానికి పయనించింది (సంఖ్యా.24:17). అరణ్యంలో యాకోబు దర్శించిన నిచ్చెనను రక్షింపబడిన ఆత్మలకు రహదారిగా ఏర్పరచి (ఆది.28:12, యోహాను 1:51) రక్షకుని కౌగిలిలో ఒదిగి పోయింది పోటీనా. ఆమె సంస్మరణార్థం ప్రతి సంవత్సరం సిలువ శ్రమదినాలలో నాల్గవ శుక్రవారాన్ని పరిశుద్ధంగా ఆచరించి, ఆ రోజు పండ్లు, చల్లని పానీయాలు పంచుతారు కాదొలిక్కులు.

# దేవుని పని

పిల్లలూ, మీరంతా స్కూల్‌కి వెళ్తూ పాఠాలతో, హోమ్ వర్క్‌తో, ఆటలతో చాలా బిజీగా ఉన్నారు కదూ! మరి ప్రతిరోజూ బైబిల్ చదువుతున్నారా? ప్రార్థన చేసుకుంటు న్నారా? మనం ఎంత బిజీగా ఉన్నా కూడా ప్రతిరోజూ బైబిల్ చదవటం, ప్రార్థించటం మానకూడదు. దానియేలులా కష్టకాలంలో కూడా ప్రార్థించటం మానకూడదు. మీరు ఒక్కసారన్నా బైబిలు పూర్తిగా చదివారా? మేము చిన్నపిల్లలం కదా అప్పుడే ఎలా చదువుతాము అనుకుంటున్నారా? చిన్న పిల్లలు చాలా గొప్ప కార్యాలు చేసిన సందర్భాలు మనం టీ.వి.లో, న్యూస్‌పేపర్లో చూస్తున్నాము. అలాగే జాషువా అనే పిల్లవాడు దేవుని కోసం ఏం చేశాడో మనం ఈ నెల కథలో తెలుసుకుందా. మరి మనం కథలోకి వెళ్దామా?

ఇంగ్లాండ్ దేశంలోని ఒక పట్టణంలో జాషువా అనే 13 సంవత్సరాల అబ్బాయి ఉండేవాడు. ఆ అబ్బాయి 8వ తరగతి చదువుతుండేవాడు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు చిన్నతనంలోనే ఒక ప్రమాదంలో చనిపోవటం వలన వాళ్ళ చిన్నాన్న వాళ్ళింట్లో పెరిగాడు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. అయినప్పటికీ వాళ్ళు జాషువాకి మేడగదిలో ఒక రూములో బస ఏర్పాటు చేసి ఎంతో ప్రేమగా చూసుకొనేవాళ్ళు. జాషువా దేవునియందు భయభక్తులతో ఉండేవాడు. ప్రతి రోజూ బైబిల్ చదవటం, ప్రార్థన చేసుకోవడం మర్చి పోయేవాడు కాదు. తను పెద్దయ్యాక దేవుని పని చెయ్యాలని ఎంతో ఆశ కలిగి ఉండేవాడు. తన తల్లిదండ్రులు చని పోయారని బాధపడినప్ప టికీ వాళ్ళు దేవుని దగ్గర ఉన్నారు కదా అని సంతోషించేవాడు.

ఒకరోజు జాషువా, వాళ్ళ చిన్నాన్న వాళ్ళతో కలిసి కారులో పిక్నిక్‌కి వెళ్తుండగా దురదృష్టవశాత్తు కారు ప్రమాదా నికిలోనై తన చిన్నాన్న కుటుంబం మొత్తం చనిపోతారు. జాషువాకి మాత్రం వెన్నెముకకి బలమైన దెబ్బ తగలటంతో లేచి నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. తల్లిదండ్రులు లేని జాషువా, ఇప్పుడు చిన్నాన్న వాళ్ళను పోగొట్టుకొని, తను లేచి తిరగలేని పరిస్థితులు రావటం జాషువాను చాలా కృంగదీసింది. అయినప్పటికీ జాషువా దేవున్ని ఎప్పుడూ నిందించలేదు. దేవా, నేను ఒక్కడినే ఇలాంటి పరిస్థితుల్లో బ్రతికి మాత్రం ఏం చేస్తాను. నన్ను కూడా తీసుకుపో అని ప్రార్థించేవాడు. ప్రభువా, నేను పెద్దయ్యాక నీ పని చెయ్యాలని ఎంతో ఆశ కలిగి యున్నాను కదా! మరి ఇలాంటి కదలలేని పరిస్థితుల్లో నీ పని ఎలా చెయ్యగలను? అని ఎంతో బాధపడే వాడు. అయితే వాళ్ళింట్లో ఉండే పనిమనిషి జాషువాకి ధైర్యం చెప్తూ ప్రేమగా చూసుకొనేది.

జాషువా కిటికీ ప్రక్కనే మంచం మీద పడుకొని కిటికీలో నుండి బయటకు చూస్తూ రోడ్డు మీద వచ్చే పోయే వాళ్ళని గమనిస్తూ ఉండేవాడు. కొంతమంది ముఖాలు ఎంతో బాధతో కష్టంలో ఉన్నట్లు గమనించే వాడు. వాళ్ళకి దేవుని వాక్యం తెలిస్తే ఎంతో సంతోషంగా ఉండేవాళ్ళు కదా అనుకునేవాడు. కానీ వాళ్ళకి ఎవరు చెప్తారు? అనుకున్నాడు. అలా ఆలోచిస్తూ ఉండగా జాషువాకి వెంటనే ఒక ఆలోచన తట్టింది. వెంటనే పనిమనిషిని పిలిచి ఒక నోట్‌బుక్, పెన్ను తెప్పించు కున్నాడు. నోట్‌బుక్‌లో పేజీలని చిన్న చిన్న ముక్కలుగా చింపి, వాటి మీద దేవుని వాక్యాలు వ్రాసి వాటిని మడతపెట్టి వాటిని ఒక్కొక్కటిగా కిటికీలో నుండి క్రిందకి వేసేవాడు. ఎవరి మీదైనా ఆ చీటి పడినప్పుడు వాళ్ళు తీసుకొని చదువుకుంటారు కదా అని. దేవుడు తనకి ఇచ్చిన ఆలోచనకై దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించాడు. అలా ప్రతిరోజూ కాగితాల మీద దేవుని వాక్యం రాస్తూ కిటికీలో నుండి క్రిందకి వేస్తూ ఉండేవాడు.

ఆ పట్టణంలోనే బిల్ అనే పెద్ద కోటీశ్వరుడు ఉండేవాడు. అతనికి ఎన్నో వ్యాపారాలు, పెద్ద పెద్ద భవంతులు, కార్లు, ఎంతోమంది పనివాళ్ళు ఉండేవారు. అయినా అతనికి ఎప్పుడూ మనశ్శాంతి ఉండేది కాదు. అనేక సమస్యలతో ఉండేవాడు. ఒకరోజు బిల్ కారు నడుపు కుంటూ ఆఫీసుకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ నడుపు కుంటూ వచ్చి బిల్

కారుని గుద్దటంతో ఆ బైక్ మీద ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే చనిపోతారు. పోలీసులు బిల్‌ని అరెస్ట్ చేసి, బెయిల్ మీద విడుదల చేస్తారు. బిల్‌కి శిక్ష పడుతుందని అందరూ అనుకుంటుంటారు. బిల్‌కి ఆ రాత్రి నిద్రపట్టదు. ఉదయాన్నే లేచి ఎంతో బాధపడుతూ తనను ఎవరు కాపాడగలరు అనుకుంటు వాకింగ్ చేసుకుంటూ జాషువా ఉండే మేడ ప్రక్కగా వెళ్తుండగా, సరిగ్గా జాషువా ఉన్న కిటికి దగ్గరకు వచ్చినప్పుడు పైనుండి ఒక చీటి బిల్ మీద పడు తుంది. బిల్ ఆ చీటి ఏమిటో అని తీసి చదవగా "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటి వారును రక్షింపబడుదురు" అన్న వాక్యం కనిపిస్తుంది. వెంటనే బిల్‌కి కొండంత ధైర్యం వస్తుంది. దేవుడు తనకు తోడు ఉన్నట్లు ఆ చీటి ద్వారా తెలియజేశాడని అర్థం చేసుకొని ఆ చీటి ఎక్కడ నుండి పడిందో చూసి, ఆ మేడ గదిలోకి వెళ్తాడు. జాషువా చీటీల మీద వాక్యాలు వ్రాస్తూ కనిపిస్తాడు. ఆ చీటి చూపించి "బాబు, నీవేనా ఈ చీటి కిటికీలో నుండి క్రిందికి వేసింది" అని అడుగుతాడు. "అవునండీ" అని సమాధానం చెప్తాడు జాషువా. అప్పుడు బిల్ తన పరిస్థితి అంతా చెప్పి, ఆ చీటి వలన తను ఎంత ఆదరణ పొందాడో చెప్పాడు. ఇద్దరూ సంతోషిస్తాడు.

జాషువా పరిస్థితి చూసిన బిల్, "జాషువా నీవు నాతో కూడా మా యింటికి రా బాబూ, నేను నిన్ను పెంచుకుంటాను" అని చెప్తాడు. అయితే జాషువా రానని చెప్తాడు. "ఎందుకు బాబూ, ఇక్కడ ఒంటరిగా ఉండటం నాతో వస్తే, నా ఆస్తి మొత్తానికి నిన్ను వారసుడిని చేస్తాను. నీకు వైద్యం చేపించి మామూలు మనిషిని చేపిస్తాను, నీకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటాను" అని బతిమాలుతాడు. "నేను రాలేనండీ" అని జవాబిస్తాడు జాషువా. "ఎందుకు బాబూ, నేను చెప్పే మాటల మీద నీకు నమ్మకం లేదా? కావాలంటే ఇప్పుడే నా ఆస్తి మొత్తానికి నిన్ను వారసుడిని చేస్తూ డాక్యుమెంట్స్ రాపిస్తాను" అని చెప్తాడు. అప్పుడు జాషువా "అందుకు కాదండీ, నాకు దేవుని పని చెయ్యాలని చాలా యిష్టం, ఇప్పటి వరకు చెయ్యలేక పోయాను. కానీ, ఇప్పుడు నేను దేవుని పని చేసే అవకాశం వచ్చింది. దీనిని నేను వదులుకోలేను. ఇప్పుడు మీరు నాకు వైద్యం చేపించి నన్ను మామూలు మనిషిని చేసి, మీ ఆస్తంతా నాకు రాసిస్తే నేను దేవుని పని చెయ్యలేనేమో. మీలాగా ఎంతోమంది దేవుని గురించి తెలుసుకొని వాళ్ళ జీవితాలు మార్చుకోవాలి. అందుకే నేను రాలేను" అని చెప్పాడు. "సరే బాబూ, నీ యిష్టం, కానీ నీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నాకు కబురు చెయ్యి" అని చెప్పి బాధపడుతూ వెళ్ళిపోతాడు బిల్.

చూశారా పిల్లలూ, జాషువా దేవుని పని కోసం తనకు వచ్చిన అవకాశాన్ని కూడా వదులుకున్నాడు. మరి మీరు దేవునికోసం ఏం చెయ్యాలనుకుంటున్నారు. కనీసం బైబిల్ పూర్తిగా చదివి దేవుని సంతోషపెట్టగలరా? ఎల్లాగైనా సరే బైబిలు పూర్తిగా చదవాలి అన్న పట్టుదలతో బైబిలు చదవటం ప్రారంభిస్తే దేవుడు తప్పక సహాయం చేస్తాడు. ప్రతిరోజూ ఐదు అధ్యాయాలు చదివితే ఒక సంవత్సరం లోపే బైబిలు పూర్తి చేయ్యొచ్చు. అప్పుడు దేవుడు మీ విషయమై చాలా సంతోషిస్తాడు. మీరు చేయవలసిందల్లా ప్రతిరోజూ అరగంట సమయం బైబిలు చదవటానికి కేటాయించాలి అంతే. ఇదేమన్నా కష్టమైన పని అనుకుంటున్నారా? దేవుడు మీకు ఆరోగ్యం, తెలివితేటలు, మంచి చదువు ఇచ్చినందుకు కృతజ్ఞతగా బైబిలు పూర్తిగా చదవ టానికి ప్రారంభించండి. దేవుడు మిమ్మును ఆశీర్వదించును గాక! వచ్చే నెలలో మరో మంచి కథ చెప్పుకుందాం!

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# కృపాదానం

దేవలాలిలో (బొంబాయి) మిలటరి స్టోరు ఇన్‌ఛార్జిగా ఉద్యోగంలో చేరాడు కృపాదానం. భార్య హన్నమ్మ ఐదుగురు పిల్లలతో నాలుగు నెలల తర్వాత వచ్చింది. దేవలాలిలో స్టోరు ఇన్‌ఛార్జిగా చేరినప్పుడు అరవై కేజీలు ఉన్న కృపాదానం ఒక సంవత్సరంలో 75 కేజీలు బరువు తూగాడు. ఇంటికి వస్తే రెండు పాంటు జేబుల్లో వంటకు తయారైన రెండు కోళ్ళు ఉండేవి. పెద్దకొడుకు శ్యామ్‌ను అక్కడ అందరు పేట్లా అని పిలిచేవారు. మూడు సంవత్సరాల వయస్సు కలిగిన శ్యామ్ పెద్ద పొట్టతో, భుజానికి సంచి, సంచి నిండా బిస్కెట్లు తింటూ క్వార్టర్సులో తిరుగుతూ ఉండేవాడు.

అంతా సవ్యంగా సంతోషంగా ఉన్న సమయంలో స్టోరులో 2000 రూపాయల విలువైన దుప్పట్లు పోయాయి. రెండువేలు అంటే ఇప్పుడు రెండు లక్షల రూపాయలతో సమానం. కృపాదానం మీదనే కేసు నమోదు చేయబడింది. కృపాదానం ఒంటరివాడు. తల్లి గుర్తుకు వచ్చింది. ఇటు వంటి క్లిష్ట సమస్యలు వచ్చినప్పుడు తల్లి అక్కమ్మ ఒంగోలు లోని ప్రార్థనా కొండమీదకు వెళ్తుండేది. తానూ వెళ్ళాలి అనుకున్నాడు. కానీ, ఇప్పుడు సెలవు మంజూరు కాదు కనుక హాస్పిటల్లో అడ్మిట్ అయి హాస్పిటల్ ఇన్‌ఛార్జి డాక్టరు గారికి తను ప్రార్థన చేసుకొని రావటానికి ఒంగోలు వెళ్ళి వస్తానని నచ్చజెప్పి ఒక్కడే ఒంగోలు వచ్చాడు. తల్లితో సంగతంతా చెప్పాడు. మరునాడు ఉదయం ఇద్దరు కొండెక్కి సాయంకాలం వరకు కొండమీదనే ఉండి ప్రార్థన చేసుకొని ఆ సాయంకాలం రైలులో బయలుదేరుతుంటే స్టేషన్ వరకు వచ్చిన తల్లి అక్కమ్మ “నాయనా! నువ్వు అక్కడికి వెళ్ళే సమయానికి అసలు దొంగలు బయటపడతారు. రైల్లో కూడా ప్రార్థన చేసుకో. దొంగలు దొరకాలని కాదు. దొంగలను దేవుడు బయలు పరచినందుకు అదే విశ్వాసము అంటే!” అంది. బొంబాయి స్టేషన్‌లో రైలు దిగి, తాను బొంబాయి వచ్చానని హాస్పిటల్‌లోని డాక్టర్‌కి ఫోన్ చేశాడు. స్టోరులో నీ అసిస్టెంటే దొంగతనం ఒప్పుకున్నాడు. నువ్వు ధైర్యంగా రా! అన్నారు డాక్టర్ గారు.

దేవుడు న్యాయవంతుడు. **ఏలయనగా న్యాయము చేయుట యెహోవానగు నాకిష్టము. ఒకడు అన్యాయముగా ఒకని సొత్తు పట్టుకొనుట నాకసహ్యము. యెషయా 61:8**

ప్రార్థనాకొండమీద ప్రార్థన చేసుకుంటేనే అద్భుతాలు జరుగుతాయి అని కాదు కాని ఆ కొండమీద 1853 డిసెంబరు 31 రాత్రంతా జువెట్ దొర ఆయన భార్య జూలి, మరి స్థానికులైన ఇద్దరు ప్రార్థన చేసి నీతి సూర్యుడు వెలిసే చోటు అని వ్రేలు పెట్టి చూపించిన ప్రదేశం అది. ఆ రోజుల్లో అంటే 1942లో ఆ ప్రార్థన కొండకు దరిదాపుల్లో ఒక్క ఇల్లు గుడిసె, జపాను తుమ్మచెట్లు గాని లేవు. నాగజెముడు ఉండేది. 1960లో కొండ క్రింద భాగమంతా ఒంగోలు మునిసిపాలిటి పారిశుద్ధ్య పనివారు గుడిసెలు వేసుకున్నారు.

1970లో క్రైస్తవేతర మతము వారు వారి ఆలయము కొరకు ఆ ప్రార్థన కొండను ఆక్రమిస్తుంటే బాధ్యత వహించవలసిన నాటి క్రైస్తవ నాయకులు, మన్నుతిన్న పామువలె మౌనంగా ఉన్నారు. నేను నాటి క్రైస్తవ నాయకులతో వ్యక్తిగతంగా కొండను కాపాడండి అని బ్రతిమలాడితే పిచ్చివాడిని చూచినట్లు చూశారు.

1945వ సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధానంతరం రిటైరైన కృపాదానం మహారాష్ట్రలోని దేవలాలి క్వార్టర్సు నుంచి బొంబాయిలో రైలెక్కి ఒంగోలు చేరాడు. ఉద్యోగ విరమణ చేసిన ఆర్మీ వారికి గౌరవ ప్రదమైన వసతులు రూపించబడలేదు. తూర్పుగోదావరి జిల్లాలోని సామర్ల కోటలోని స్టేషన్‌లో రెండు అంగుళాల మందం

కలిగిన టేకు బీరువాలో హెగ్గిన్ బాథమ్స్ పుస్తకాలు విక్రయించే ఉద్యోగం ఇచ్చారు.

తనకి ఊహ తెలిసినప్పట్నుంచి కృపాదానంగారి తల్లి కుమ్మరకుంట అక్కమ్మగారు, తన 13వ సంతానమైన కృపాదానంను, ప్రార్థనలోను వాక్యంలోను పెంచినందున ఈ లోకంలో ఏ ఉద్యోగం కూడా ఆయనకు జీవనాధారం కాకూడదనుకొనేవాడు. అందుకు తోడుగా తన భార్యయైన కూచిపూడి హన్నమ్మగారు ఆనాటి గుంటూరు జిల్లా అంతటా గొప్ప పేరు సంపాదించిన లూథరన్ మిషన్ నాయకుడు కూచిపూడి రాజరత్నంగారికి ఏకైక సోదరి.

ఆ రోజుల్లో తూర్పుగోదావరి తుని తాలూకా భీమ వరపుకోట అను కుగ్రామములో కృపాదానం భార్యకు టీచర్ ఉద్యోగం వచ్చినందున విజయవాడలో రైలు దిగి కొంత ముఖ పరిచయమున్నటువంటి మెట్రోపాలిటిన్ చర్చి గుణదల మీదుగా నడుస్తున్నప్పుడు ఆ చర్చి హెడ్ రెవ. పెటింగల్‌గారు చర్చిలోనికి ఆహ్వానించి, తను తుని తాలుకాకి ప్రయాణమై పోతున్నాడు గనుక కృపాదానం కుటుంబాన్ని కూడా తన స్టేషన్‌గన్ కారులో తీసుకెళ్తానని చెప్పి ఆ మరునాడు ఉదయం తుని వైపుగా ప్రయాణమయ్యారు.

ఒక గంట ప్రయాణం తరువాత, ముందు వరుసలో ఉన్న మిషెనరీ, కారు నడుపుతుండగా ప్రక్కన ఇద్దరు పాదరిలు కూర్చున్నారు. అప్పుడు ఆ మిషెనరిగారు కృపాదానం కుటుంబమును దేవుడు ఎన్నుకొని ఎంతో ఆశీర్వదించాడు అన్నాడు. అప్పుడు కృపాదానం ఏ విధంగా ఆశీర్వదించాడు? అన్నాడు

నీవు, నీ భార్య, నీ పిల్లలు అమెరికా దేశం నుంచి దిగుమతి అయిన కారులో కూర్చుని ఉంటే. ఇంగ్లాండు దేశం నుండి వచ్చిన మిషెనరీ కారు డ్రైవర్ అయ్యాడు. మీ కుటుంబమునకు మార్గమధ్యలో సహాయం చేయుటకు ఇద్దరు స్థానిక పాదరిలను దేవుడు ఏర్పాటు చేశాడు కదా! అందుకని నీవు ఘనత వహించినవాడవు అన్నాడు.

అందుకు కృపాదానం ఇప్పుడు నేను దీవించబడి యున్న దీవెనలో ఇది చాలా అల్పము అన్నాడు.

కారులో ప్రయాణము చేస్తున్న వారందరూ ఆశ్చర్య పోయారు.

అప్పుడు కృపాదానం ఈ లోకంలో నేను ఈ కారులో ప్రయాణము చేస్తున్నాను కానీ, ఒక రోజు నన్ను, నా కుటుంబాన్ని దేవుని దగ్గరకు తీసుకొనిపోవటానికి ప్రముఖులైన దేవదూతలు వస్తారు కదా! అన్నాడు.

1945లో రెండవ ప్రపంచ యుద్ధము ముగిసినది. దేవలాలిలో ఉన్న సమయంలో కృపాదానం మూడవ సంతానమైన మరియమ్మ (ఇద్దరు కవల పిల్లలలో చిన్న కుమార్తె) మూడు సంవత్సరాల వయస్సులో చనిపోయింది. మార్తమ్మ మిగిలింది.

**<u>చందాదారుల వివరములు</u>**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపొ. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

# మీ పట్ల దేవుని ప్రణాళిక

ఈ భూమ్మీద మొదట నిర్మించబడిన ఆదాము నుండి భూమి గతించక మునుపు జన్మించే మానవుని వరకు ప్రతి ఒక్కరూ దేవుని ప్రణాళికలో భాగంగానే ఈ భూమ్మీదకు వస్తారు. ఈ భూమ్మీద జన్మించిన ప్రతి ఒక్కరూ దేవుని బిడ్డలే. ప్రతి ఒక్కరిపట్ల దేవునికి ఒక ప్రణాళిక ఉంటుంది. ఇశ్రాయేలు పన్నెండు గోత్రములలో లేవీ గోత్రపు వారిని దేవుడు తన సేవకు ప్రత్యేకపరచుకున్నాడు. అంటే ఆ గోత్రమును ఏర్పరచుకొన్నప్పటి నుండి పుట్టబోయే ప్రతివారు కూడా దేవుని సేవ కొరకు ఏర్పరచ బడిన వారే. వారిలో వారి సామర్థ్యమునుబట్టి వారు చేయవలసిన పనులు కేటాయించబడేవి. లేవీ గోత్రములోని ప్రతి ఒక్కరూ దేవుని సేవకై ప్రత్యేకింపబడిన వారు. అలాగే దేవుడు ఆదామును ఏర్పరచుకొన్నప్పుడు ఆదాము సంతానములోని ప్రతి ఒక్కరూ, వారు ఏ జాతివారైనా, ఏ దేశము వారైనా, ఏ మతము వారైనా దేవుని ప్రణాళికలో భాగమే. ప్రతి ఒక్కరినీ దేవుడు ప్రేమిస్తాడు. ఎవరినీ తృణీకరించడు. అయితే మనుష్యులు ఈ లోక సంబంధముగా వారు ఏర్పరచుకున్న మార్గములో వెళ్ళి దేవునికి దూరమవుతున్నారే తప్ప దేవుడు ఎవరినీ దూరపరచుకోడు. జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత ఆయన మనలను ఏర్పరచుకుంది మనం దేవుని కోసం జీవించాలనే తప్ప మన ఇష్ట ప్రకారం ఈ లోకానుసారంగా జీవించడానికి మాత్రం కాదు. తన స్వహస్తాలతో తన కోసం సృజించుకున్న ఆదాము హవ్వలను సాతాను ఏదెను తోటలో ప్రలోభాలకి గురిచేసి దేవునికి దూరం చేసింది. తద్వారా నిత్యము జీవించే అవకాశం కోల్పోయి చావును కొని తెచ్చుకున్నారు. అలాగే జగత్తు పునాది వేయబడక మునుపే ఏర్పరచుకున్న మనల్ని కూడా దేవుని ప్రణాళిక నుండి దూరం చేయ్యాలన్న ఉద్దేశ్యంతో సాతాను ఈ లోకంలో ప్రవేశపెట్టిన అనేక రకాలైన తంత్రాలకు ఆకర్షితులైనవారు దేవునికి దూరమవుతున్నారు. ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమించే వారు దేవుని ప్రణాళికలో నుండి బయటకు వెళ్ళిపోతారు. ఎవరైతే స్వచ్ఛందంగా దేవుని దగ్గరకు వస్తారో వాళ్ళు మాత్రమే దేవుని ప్రణాళికలో భాగంగా జీవిస్తారు. వారు మాత్రమే దేవుడిచ్చే సంతోషాన్ని పొందుకొని నెమ్మదిగా జీవిస్తారు. కాబట్టి మనం దేవుని దగ్గరకు వచ్చి దేవుని ప్రణాళిక ప్రకారం జీవిద్దాము. దేవుడు మిమ్మును దీవించును గాక!

## పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక-3 జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 యె | 2 హో | షా | 3 పా | 4 తు | | |
| 5 అ | | రి | లి | | 6 క | లా | | 7 దో |
| 8 హు | 9 ర | కో | | | | 10 పి | 11 లు | పు |
| 12 జా | ము | | 13 న | యో | 14 మి | | 15 యే | డు |
| ము | క | | డు | | 17 ది | ము | న | |
| 18 దా | త | | 19 ము | ఖ | ము | | 20 త | 21 ల |
| 22 ర | మ | 23 అ | | | | 24 ది | న | ము |
| | | 25 హా | యి | | 26 జా | గు | | కో |
| | | 27 బూ | ర | ధ్వ | ను | లు | | కా |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -3**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. యం. కృపావాణి, నల్గొండ
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
4. టి. సుదర్శన్, నంద్యాల
5. కె. లలితాబాయి, వైజాగ్
6. యస్. నీలవేణి, విజయవాడ
7. ఎస్. మనోహర్, నరసాపురం
8. ఆర్. దయామణి, రాజమండ్రి
9. బి. విక్టోరియా, గుంటూరు

# దేవుడు - సిరి

మనందరికి తలా కాస్త దీవెన ఉంటేచాలు అనుకుంటాము. యేసుప్రభువునకు మనము ఏదో కాస్త ఇవ్వాలని అనుకోవడం లేదు. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని" అన్నాడు. అయిదు రొట్టెలు, రెండు చిన్నచేపలను దాదాపు పదివేల మందికి ఆహారముగా ఆయన పెట్టినప్పుడు చేపలను కూడా వారికిష్టమైనంత మట్టుకు వడ్డించెను అని యోహాను, వారందరు తిని తృప్తిపొందిరి అని లూకా, వారందరు తిని తృప్తి పొందిన తర్వాత అని మార్కు, వారందరు తిని తృప్తి పొందిన తరువాత అని మత్తయి వ్రాశారు. ప్రభువు మనకు ఏది ఇచ్చినా ఎప్పుడు ఇచ్చినా తృప్తిగానే ఇస్తాడు. అయితే ప్రభువు అలా సమృద్ధిగా ఇవ్వాలంటే ముందు మనదగ్గర ఉన్నదంతా ఆయన చేతిలో పెట్టాలి. మనదగ్గర మనము కొంత దాచుకొని, కొంత దేవునికిస్తే అది ఆయన శక్తిని మనం శంకించిన వారమని అర్థము.

ఆది సంఘములో శిష్యులనబడిన వారును, విశ్వసించిన వారందరు ఏకహృదయమును, ఏకాత్మను గలవారైయుండిరి. కలిగిన వారందరు వాటిని అమ్మి అమ్మినవాటి వెలతెచ్చి వారి యొద్ద పెట్టుచువచ్చిరి. వారు ప్రతివానికి వారి వారి అక్కర కొలది పంచిపెట్టిరి గనుక ఎవనికిని కొదువలేక పోయెను.

అననీయ, సప్పీర భార్యాభర్తలు. వీరు విశ్వాసులు. దేవుని ప్రజలు. దేవునికి అర్పించిన వాటిలో వీరు సమృద్ధి కలిగియున్నారు. ఇప్పుడు తమ వంతుగా వారు కూడా దేవునికి ఇవ్వాలని అనుకున్నారు. దేవుడు వారిని గమనిస్తున్నాడని మరచిపోయారు. 'భవిష్యత్తులో ఏదైనా కష్టమొస్తే ఎవరు చూస్తారు? మనం దాచుకున్న డబ్బు మన అవసరాలకు పనిచే స్తుందనుకొని కొంతదాచారు. వాళ్ళ ఆస్తిలోని డబ్బు తెచ్చి ఇమ్మని పేతురు అడుగలేదు. కాని పేతురుని మోసం చెయ్యడం, దేవుని మోసం చెయ్యటమే కదా! అని మరచిపోయారు, మరణించారు. ప్రవక్తయైన ఎలీషా శిష్యులలో ప్రధమ శిష్యుడు గేహజి. అంటే ప్రధమ విశ్వాసి. అతను దొంగకాదు. కానీ, ఎలీషాకంటే తెలివిగలవాడనను కున్నాడు. ఈ వెండిలో కొంత మన దగ్గరుంటే అవసరాలకు పనికి వస్తుందని అనుకున్నాడు. గేహజి రెండు మణుగుల వెండిని అడిగితే నయమాను నాలుగు మణుగుల వెండిని ఇచ్చాడు. గేహజీ నాలుగు మణుగుల వెండి తీసుకొనినా, నాలుగు తులముల వెండి తెచ్చుకొనినా శిక్ష కుష్టురోగమే!

దేవుని విషయంలో చిన్న మనసు, దేవుని శక్తిని శంకించే మనసు అతనికి కుష్టురోగం రావడానికి ఆస్కారమైంది. అబ్రాహాము ఆశీర్వదించబడవలెనని కోరుకుంటే తన దేశాన్ని, తన బంధువులను, తండ్రి ఇల్లును వదిలిపెట్టాలి. అతని తండ్రి అతనిని వదలివెళ్ళిన తర్వాతనే, హారాను నుండి మరలా ప్రయాణమై లోతు అతనిని వదిలి వెళ్ళిన తర్వాతనే లేక లోతు నుండి అబ్రాహాము వేరైన తర్వాతనే ఇదంతా నీకిచ్చెదను అని దేవుడు చెప్పాడు.

యాకోబు తన తండ్రి ఇంటిని వదిలి తన చేతి కర్రతో యొర్దాను దాటిన తర్వాతనే అతను ఆశీర్వదింపబడ్డాడు. యోసేపు తండ్రికి, తన వారందరికి దూరమై చెరసాలలో పానదాయకునికి దూరమైన తర్వాతనే దీవెనలు సమృద్ధిగా అతనిమీదకు వచ్చాయి.

లూకా 6:38లో 'ఇయ్యుడి అప్పుడు మీకియ్యబడును' అని వుంది. అంటే మొదట మనం దేవుని పేరట ఇతరులకు ఇవ్వాలి. తర్వాత మనకు ఇవ్వబడుతుంది. మనకు సమృద్ధిగా ఇవ్వబడాలంటే అణచి, కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు.

**మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీరు మరల కొలవబడుదురు అని యేసుప్రభువు చెప్పాడు.**

# లోకంతీరు

(పుట్టుక చావు మధ్య సంబరం)

**"మనుష్యుడు ఏపాటివాడు? అతని ఘనపరచనేల? అతని మీద నీవు మనస్సు నిలుపనేల?" యోబు 7:17**

మనిషి ఈ లోకంలో జీవించినంత కాలంలో దేవునికి తన జీవితం మీద ఇచ్చే అధికారం చాలా తక్కువ. తనకు అసాధ్య మైన పరిస్థితుల్లో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో మాత్రమే దేవున్ని ఆశ్రయించటం జరుగుతుంది. ఎక్కువగా నయంకాని జబ్బుల గురించో, బిడ్డలు లేకపోతేనో, చావు బ్రతుకుల మధ్య వుంటేనో దేవుని దగ్గరకు వస్తారు. చాలామంది అపోహ కూడా అదే, ఎంతో అవసరమైతే తప్ప దేవుని దగ్గరకు వెళ్ళకూడదేమో అను కుంటారు. దేవున్ని చర్చి వరకే పరిమితం చేస్తారు. వారానికి ఒక్కరోజు చర్చికి వెళ్ళి, కళ్ళు మూసుకొని ప్రార్ధన చేసు కొని, ఆ వారంలో వాళ్ళు చేసిన పాపాలు ఒప్పుకొని, చందా వేసి రావడంతో దేవునితో వాళ్ళకున్న సంబంధం ముగుస్తుంది. మళ్ళీ వారం తర్వాత దేవుని దగ్గరకు వెళ్తారు. ఈ లోపల అనుకోని అవాంతారం ఏదైనా వస్తే తప్ప దేవుడు గుర్తుకు రాడు. అయితే మనిషి ఎలా ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు? ***"కాబట్టి మీరు ఈ నా మాటలను మీ హృదయములోను, మీ మనస్సులోను ఉంచుకొని వాటిని మీ చేతుల మీద సూచనలుగా కట్టుకొనవలెను. అవి మీ కన్నుల నడుమ బాసికములుగా ఉండవలను. నీవు నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచు నప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి మాటలాడుచు, వాటిని మీ పిల్లలకు నేర్పి నీ యింటి ద్వార బంధముల మీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయ వలెను" ద్వితీయో. 11:18-20.*** ఈ వాక్య ప్రకారము చూస్తే మనిషి దేవుని గూర్చి ఆలోచించని సమయమే పేర్కొనలేదు. కూర్చున్నప్పుడు, నడుచునప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి మాట్లాడాలి అంటే అర్థం, దేవుడు ఎప్పుడూ మన హృదయము లోనే ఉండాలి అని దేవుడు కోరుకుంటున్నాడు. మరి నేటి కాలంలో అది జరుగుతుందా? సామాన్యుల సంగతి సరే, సంఘాన్ని నడిపించాల్సిన సంఘకాపరులు దాని, సువార్తికులు గాని అలా చేస్తున్నారా?

తన గురించే మనిషి ఆలోచించాలి అని దేవుడు కోరు కుంటుంటే, మరి మనిషి ఏం కోరుకుంటున్నాడు? తన గురించే తాను ఆలోచించుకుంటున్నాడు. ప్రతిదీ తనకు అనుకూలంగా జరగాలని, ప్రతి మేలు తనకే జరగాలని కోరుకుంటున్నాడు. స్వార్ధం మనిషిని దేవుని నుండి దూరం చేస్తుంది. 'నేను' 'నాది' అనుకోవడం వలన మనిషి జీవితంలో దేవునికి ప్రాముఖ్యత లేకుండా పోతుంది. మనిషి తల్లి గర్భంలో నుండి పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా జన్మించిన తర్వాత 'నేను' అనుకొనేంత వయస్సు వచ్చే వరకు జీవించి వుండటమే దేవుని కృప. శరీరములోని అవయవాలన్నీ సరైన స్థానంలో వుండి సరిగ్గా పనిచేయగలగటమూ దేవుని కృపే. కుంటివారిగా, గ్రుడ్డివారిగా, మూగవారిగా, చెవిటి వారిగా, బుద్ధిమాంద్యము గలవారిగా పుట్టించకుండా వుండటం దేవుని కృపే కదా! ***"మానవునకు నోరిచ్చినవాడు ఎవడు? మూగవానినేగాని చెవిటివానినేగాని దృష్టిగల వానినేగాని గ్రుడ్డివానినేగాని పుట్టించిన వాడెవడు? యెహోవానైన నేనే గదా!" నిర్గమ. 4:11.*** మరి దేవుడు తన కృపాకని కరములతో మనిషిని పరిపూర్ణ మానవునిగా పుట్టించిన తర్వాత, ఆ మనిషి తను వ్యక్తిగతంగా ఆ స్థాయికి, అంటే 'నేను' అనుకొనగలిగే స్థాయికి రావడానికి దేవుడే కారణము అని గుర్తెరగక పోవడం వలన 'నేను' అన్న స్థాయిని తనకు తాను అన్వయించు

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

కుంటున్నాడు. అంటే ఆ 'నేను' అనుకొన గలిగే స్థాయికి రావడానికి తనే కారణం అనుకుంటున్నాడు.

'నేను' అనుకొనే స్థాయికి వచ్చినప్పటి నుండి మనిషి జీవితం ప్రారంభమవుతుంది. అప్పటి నుండి తన జీవితానికి సంబంధించి భవిష్యత్ ప్రణాళికలు వేసుకుంటుంటాడు. ఏమి చదవాలి? ఏమి పని చేయాలి? ఏలాంటి వారిని పెళ్ళి చేసుకోవాలి? ఎలాంటి ఇల్లు కట్టాలి? డబ్బు ఎలా కూడ బెట్టాలి? చనిపోయే వరకు చీకూ చింతా లేని జీవితం ఎలా జీవించాలి? అన్న ప్రణాళికలు వేసుకోవడంతోనే జీవితం మొత్తం సరిపోతుంది. ఒక్కొక్కరు ఒక్కో నిర్ణయం తీసుకుంటారు. కొంతమంది బాగా చదివి, మంచి ఉద్యోగం చేస్తూ, డబ్బు సంపాదించి, పెళ్ళి చేసుకొని, ఇల్లు కట్టుకొని, డబ్బు కూడబెట్టుకొని దిగులు చింతా లేకుండా ఉండాలని కోరుకుంటారు. అలాగే కొంత మంది వ్యాపారం చేసి ఇవన్నీ పొందాలి అనుకుంటారు. కష్టపడి సంపాదించటం ఇష్టంలేని వారు అక్రమ మార్గాల ద్వారా డబ్బు సంపాదించి ఇవన్నీ పొందాలనుకుంటారు. కాబట్టి మనిషి అంతిమ లక్ష్యం సుఖవంతమైన జీవితం జీవించటం. అందుకు మనిషి ఎన్నుకొనే మార్గం డబ్బు. దేవుడు తనకు ప్రత్యామ్నాయంగా సృష్టించుకున్న డబ్బు వైపే మనిషి మొగ్గు చూపుతున్నాడు. అందుకు కారణం మనిషి దేవుడిని హృదయ పూర్వకంగా నమ్మక పోవడమే.

**చావు**


**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

మనిషికి విలువ ఇవ్వడానికి దేవునికి ఎలాంటి కారణం లేదు. కేవలం తన ప్రేమనుబట్టి, కృపనుబట్టి, జాలినిబట్టి మాత్రమే మనిషికి దేవుడు ఎంతో విలువ ఇస్తున్నాడు. ఎంత విలువ ఇస్తున్నాడంటే ఒక మనిషి మొరనుబట్టి భూమిని ఒక రోజంతా తిరగనివ్వకుండా చేశాడు (యెహోషువ 10:12-14). అయితే దేవుడు మనిషికి ఎంత విలువ ఇచ్చాడో బైబిల్లో వ్రాయబడిన ఈ వాక్యాన్ని బట్టి చూస్తే అర్ధమవుతుంది "నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్రనక్షత్రములను నేను చూడగా నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? దేవునికంటె వానిని కొంచెము తక్కువ వానిగా చేసియున్నావు. మహిమ ప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసియున్నావు. నీ చేతి పనుల మీద వానికి అధికారమిచ్చి యున్నావు" కీర్తనలు 8:3-6. అయితే వాస్తవానికి ఈ భూమి మీద మనిషి స్థితి ఏంటి? బైబిలు ప్రకారం చూస్తే మనిషి యొక్క స్థితి ఈ విధంగా వర్ణింప బడింది. "సర్వశరీరులు గడ్డిని పోలినవారు" (1పేతురు 1:24) "మనుష్యులు వట్టి నీడ వంటివారై తిరుగులాడుదురు" (కీర్తనలు 39:6), "మీ జీవమేపాటిది? మీరు కొంత సేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరి వంటివారే" యాకోబు 4:14. "మనుష్యుడు ఏపాటివాడు? అతని ఘనపరచనేల? అతని మీద నీవు మనస్సు నిలుపనేల?" యోబు 7:17. ఇదీ భూమి మీద మనిషి యొక్క పరిస్థితి. అయితే మనిషి తన స్థితి ఏంటో తెలుసుకోలేక, ఈ గడ్డివంటి, నీడ వంటి, ఆవిరివంటి జీవితానికి అత్యున్నత స్థానం కల్పించుకొని దేవుని కృపలేనిదే తనకు బ్రతుకు లేదు అని గ్రహించకుండా చివరికి దేవుడే లేదు అన్న స్థితికి దిగజారిపోయాడు. ఇలాంటి మనిషి భూమి మీద బ్రతకడానికి పడే పాట్లకు ఎవరు కారణం? తనకు జరిగే కీడుకి, అనర్ధాలకి ఎవరు కారణం? ఖచ్చితంగా ఎవరికి వారే కారణం. అందులో ఏ మాత్రం అనుమానం లేదు. దేవున్ని హృదయ పూర్వకంగా నమ్మలేకపోవడమే ముఖ్యమైన కారణం. **(ఇంకా వుంది)**

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -4



**అడ్డం:**

1. యావత్తు వ్రాయండి (3)
4. ---(3) అనగా ఏపాలో దశమ భాగము (నిర్గమ)
7. కొందరు ఆయన(యేసు)ను --(2) చేతులతో కొట్టి 'నిన్ను కొట్టిన వాడెవడో ప్రవచింపుమనిరి.
8. ప్రముఖ సువార్త గాయకుడు జాన్‌బిల్మోరియా ఇంటిపేరు(3)
10. అడ్డం పదైనా, నిలువు ఆరైనా ఒకటే (3)
11. ---(3) నందుండి నేను యెహోవాకు మొఱ్ఱపెట్టితిని.
13. ఇశ్రాయేలు వంశంలో నఫ్తాలి గోత్రంలో ఏనాను కుమారుడు (సంఖ్యా) తారుమారు (3).
17. రాజగు బెల్షస్సరు నగరు గోడమీద మానవ హస్తపు వ్రేళ్ళు వ్రాసిన శాసన మొదటి భాగం (4) తారుమారై ఒక 'నే' పొల్లు పోయింది.
18. పౌలుకు ఈ కంచరి వాడు చాలా కీడు చేసెను (4)
19. యేసు శిష్యులలో మొదటి నలుగురి వృత్తి (3). కాని మధ్యలో 'జ' వచ్చి చేరింది.
21. క్రీస్తుయేసునందు పౌలుకు జతపనివాడు (3) అటునుండి.
23. ఈ చెట్టు ద్వారా యెహోవా యోనాకు గుణపాఠం నేర్పాడు(3)
24. సౌలును ప్రవక్తలలో నున్నాడా అను ---(3) పుట్టెను.
26. బెన్యామీను ఐదవ కుమారుడు (2) (1దినవృ.)
28. నా కుమారుడా పర---(3) నీవేల కౌగలించుకొందువు. తారుమారు (నడుమ నారి)
29. సితారాను, సానికను వాడుక చేయు వారందరికి మూల పురుషుడు (ఆదికాండము)

**నిలువు:**

1. రిస్పా ఇతని కుమార్తె. యావత్తు లేదు క్రింద నుండి పైకి (2) (2సమూ.)
2. ఆయన బేతనియ ---(3) వారిని తీసుకొని పోయి ఆశీర్వదించెను.
3. నీవు యౌవనేచ్ఛల నుండి 'పారిపొమ్ము'. పొమ్ము పోగా మిగిలినది క్రింద నుండిపైకి (2)
5. కెలూబు ఎష్తోనునకు తండ్రి (3) తారుమారు (1దిన)
6. యెహోవా ఉత్తముడని --(2) చూచి తెలిసికొనుడి.
8. కెఫా అను మాటకు అర్థము (2)
9. యేసు జనన వార్త విన్న హేరోదు 'కలవరము'లో లవము లేదు.
12. సమూయేలు పెట్టిన 'సహాయపురాయి' అని అర్థమిచ్చు పేరు (5) తారుమారు
14. శారాను తన యింట చేర్చుకొనిన గెరారు రాజు (5) తారుమారు
15. హెబ్రీ అక్షరాలలో 15వది (3) కీర్తనలు 119.
16. ఫేలిక్సుకు యూదురాలైన భార్య (3) తారుమారు
19. ---(3) యుందు ఛాయకు పోక నీ మార్గము... (సామెతలు)
20. దెలీలా ఫిలిష్తీయులతో చివరి ప్రయత్నంగా ఈ--(2)కి రండి అని పిలిచినది. (క్రింద నుండి)
21. సహోదరుల ఐక్యత --(2) పోయబడి (క్రింద నుండి)
22. ఈ సముద్రమును లవణ సముద్రమని అంటారు (3) యెహోషువ.
23. ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (2) నానార్థము.
25. యేసుకు పూర్వీకులలో ఒకడు (2) వంశావళి.
27. పేతురు 'వాక్యమును' దీనితో పోల్చాడు (2)

**గమనిక:-** పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక-4లోని గళ్ళను పూరించి, ఫోటో తీసి 9440217726 నంబరుకు వాట్సాప్ ద్వారా లేదా kerajendra@gmail.com కు ఈ-మెయిల్ ద్వారా పంపగలరు. వాట్సాప్, ఈ-మెయిల్ లేనివారు తెల్లపేపరు మీద లేదా పోస్ట్ కార్డు మీద అడ్డము, నిలువు సమాధానాలు వ్రాసి, ఎడిటర్, హన్నాకృప, పోస్ట్‌బాక్స్ నెంబర్-51, ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా, ఆం.ప్ర. అను అడ్రసుకు పంపగలరు.